

రత్నాచల్ సహా పలు రైళ్లు రద్దు

విశాఖపట్నం, జూలై 24 (ఆంధ్రజ్యోతి): తాడి-దువ్వాడ స్టేషన్ల మధ్య నాన్ ఇంటర్ లాకింగ్, ట్రాక్ పునరుద్ధరణ పనులు చేపడుతున్న నేపథ్యంలో పలు రైళ్లను రద్దు చేసినట్టు సీనియర్ డీసీఎం కె.సందీప్ తెలిపారు. ఈ నెల 26, 28, 30 తేదీల్లో విశాఖ-విజయవాడ-విశాఖ రత్నాచల్ ఎక్స్‌ప్రెస్, రాజమండ్రి-విశాఖ-రాజమండ్రి మెము పాసింజర్, కాకినాడ-విశాఖ-కాకినాడ మెము పాసింజర్, ఈనెల 26, 30 తేదీల్లో గుంటూరు-విశాఖ-గుంటూరు ఉదయ్ ఎక్స్‌ప్రెస్‌లను రద్దు చేశామని పేర్కొన్నారు.

పెండింగ్ సమస్యలకు మోక్షం


జిల్లాకు సంబంధించి పలు అంశాలకు రాష్ట్ర మంత్రిమండలి ఆమోదం

- కేంద్రీయ విద్యాలయానికి పది ఎకరాలు కేటాయింపు
- తాండవ ఆధునికీకరణ పనుల టెండర్ ప్రీ-క్లోజ్
- చెర్లోపలి ఆవఖండంలో వీఎంఆర్‌డీఏ లేఅవుట్ అభివృద్ధికి గ్రీన్ సిగ్నల్

అనకాపల్లి, జూలై 24 (ఆంధ్రజ్యోతి)

ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అధ్యక్షతన గురువారం ఏపీ సచివాలయంలో జరిగిన మంత్రివర్గ సమావేశంలో జిల్లాలో పలు అభివృద్ధి కార్యక్రమాల అమలుకు మంత్రి మండలి ఆమోదం తెలిపింది.

అనకాపల్లి మండలం సుందరయ్యపేట రెవెన్యూ సీతానగరం, అచ్చెయ్యపేట గ్రామాల పరిధిలో సర్వే నంబరు 511-2లో పది ఎకరాల ప్రభుత్వ భూమిని కేంద్రీయ విద్యాలయం (కేవీ) ఏర్పాటు కోసం కేంద్రీయ విద్యాలయ సంఘటన్ (సికింద్రాబాద్)కు అప్పగించడానికి ఆమోదం తెలిపింది. టీడీపీ గతంలో అధికారంలో వున్నప్పుడు (2014-19) కేంద్రీయ విద్యాలయం ఏర్పాటుకు సుందరయ్యపేట, అచ్చెయ్యపేట గ్రామాల సరిహద్దుల్లో 10 ఎకరాలను అప్పటి ప్రభుత్వం కేటాయించింది. తరువాత అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం... కేంద్రీయ విద్యాలయం భవన నిర్మాణాల కోసం భూమిని అప్పగించలేదు. గత ఏడాది కూటమి అధికారంలోకి వచ్చిన తరువాత స్థానిక ఎంపీ సీఎం రమేశ్, ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ కేంద్రీయ విదాలయానికి స్థలాన్ని కేటాయించాలని పలుమార్లు కోరడంతో ప్రభుత్వం స్పందించింది. జిల్లా రెవెన్యూ అధికారులు చేసిన ప్రతిపాదన మేరకు కేంద్రీయ విద్యాలయానికి భూమి అప్పగిస్తూ ఈ మేరకు మంత్రివర్గం నిర్ణయం తీసుకుంది. దీంతో ... మిగతా 8వ పేజీలో



అనకాపల్లి మండలం సుందరయ్యపేటలో కేంద్రీయ విద్యాలయానికి కేటాయించిన స్థలం ఇదే



తాండవ రిజర్వాయర్

ఐటీ హబ్‌గా విశాఖ

- పలు కంపెనీలకు భూ కేటాయింపులు
- మంత్రి మండలి ఆమోదం
- ఉద్యోగాల కల్పనే లక్ష్యం
- ఫీనమ్ పీపుల్, సిఫీ ఇన్ఫినిటీ స్పేసెస్, సత్వ, బీవీఎం ఎనర్జీ, ఏఎన్ఎస్ఆర్ సంస్థల రాక
- మెడ్‌టెక్ జోన్‌లో లాన్సమ్ 5 స్టార్ హోటల్
- సిటీలో ఐటీసీ హోటల్

విశాఖపట్నం, జూలై 24 (ఆంధ్రజ్యోతి):

పెట్టుబడిదారులను ప్రోత్సహించి యువతకు పెద్దఎత్తున ఉద్యోగ అవకాశాలు కల్పించాలనే ధ్యేయంతో రాష్ట్ర ప్రభుత్వం విశాఖలో పలు సంస్థలకు భూములు కేటాయించింది. ఎకరా రూ.30 కోట్లకు పైగా విలువ చేసే భూములను 5 శాతం, అంతకంటే తక్కువ ధరకు ఇచ్చింది. మధురవాడ, రుషికొండ, ఎండాడ ప్రాంతాల వైపు భూములు కేటాయిస్తూ గురువారం నిర్వహించిన రాష్ట్ర మంత్రివర్గ సమావేశం నిర్ణయం తీసుకుంది. ఈ సంస్థల రాకతో ఐటీ రంగంలో విశాఖపట్నం అగ్రస్థానానికి చేరనుంది. డేటా హబ్‌గా మారుతుంది.

- **బీవీఎం ఎనర్జీ అండ్ రెసిడెన్సీ:** ఈ సంస్థకు ఎండాడలో పనోరమ హిల్స్ వెనుక ఒకేచోట ఏపీఐఐసీ ద్వారా 30 ఎకరాలు కేటాయించారు. వీరు రూ.1,250 కోట్ల పెట్టుబడి పెట్టి 15 వేల మందికి ఉపాధి కల్పిస్తారు. ఎకరా రూ.1.5 కోట్లకు ఇచ్చారు.
- **ఫీనమ్ పీపుల్స్ ప్రైవేట్ లిమిటెడ్:** ఈ సంస్థకు మొత్తం 4.45 ఎకరాలు కేటాయించారు. రుషికొండ హిల్ నంబరు 2లోని నాన్ సెజ్ ఏరియాలో 45 సెంట్లు, మధురవాడ హిల్ నంబరు 4లో నాలుగు ఎకరాలు కేటాయించారు. వీరు దశల వారీగా ఐదేళ్లలో 2,500 మందికి ఉద్యోగాలు కల్పిస్తారు. ఏడాదిలో క్యాంపస్ ఏర్పాటు చేసి, రెండేళ్లలో 1,250 మందికి, ఆ తరువాత మరో రెండేళ్లలో ఇంకో 1,250 మందికి ఉద్యోగాలు ఇస్తారు. వీరి పెట్టుబడి రూ.207.5 కోట్లు కాగా వారికి ఎకరాకు రూ.4.05 కోట్ల చొప్పున ధర నిర్ణయించారు.
- **సిఫీ ఇన్ఫినిటీ స్పేస్:** ఈ సంస్థకు రుషికొండ హిల్ నంబర్ 3లో 3.6 ఎకరాలు ఎకరా కోటి రూపాయల చొప్పున ఇచ్చారు. అదేవిధంగా పరదేశిపాలెంలో 50 ఎకరాలు, ఎకరా కేవలం రూ.50 లక్షలకు ఇచ్చారు. వీరు రూ.16,466 కోట్లు పెట్టుబడి పెట్టి 600 మందికి ఉద్యోగాలు ఇస్తారు. ఈ సంస్థ కీలకమైన డేటా హబ్‌ను అభివృద్ధి చేస్తుంది. డేటా స్టోరేజ్, క్లౌడ్ కంప్యూటింగ్‌లను ... మిగతా 8వ పేజీలో

ఉత్సాహంగా ఖరీఫ్

అవసరమైన సమయంలో సమృద్ధిగా వర్షాలు

అందుబాటులోకి వస్తున్న వరి నారు

- రిజర్వాయర్లలో పుష్కలంగా నీరు
- ఆయకట్టుకు విడుదల కోసం తేదీలు ఖరారుచేసిన అధికారులు
- దమ్ము పనుల్లో రైతులు బిజీ

చోడవరం వద్ద నాటడానికి అందుబాటులోకి వచ్చిన వరినారు, పొలంలో నిలిచిన వర్షం నీరు



చోడవరం, జూలై 24 (ఆంధ్రజ్యోతి):

ఖరీఫ్ సీజన్‌లో పంటల సాగుకు సానుకూల వాతావరణం ఏర్పడడంతో అన్నదాతలు ఆనందం చెందుతున్నారు. వరి నాట్లు వేసే సమయం దగ్గర పడుతున్న తరుణంలో ఉపరితల ద్రోణి, బంగాళాఖాతంలో అల్పపీడన ప్రభావాలతో కొద్ది రోజుల నుంచి ఆశాజనకంగా వర్షాలు కురుస్తున్నాయి. ముందుగా ఆకుమడులు పోసిన పొలాల్లో వరి నారు అందుబాటులోకి రావడంతో నాట్లు వేసేందుకు దమ్ము పనులు చేస్తున్నారు. రిజర్వాయర్ల నుంచి నీటిని విడుదల చేసిన వెంటనే నాట్లు వేయడానికి సన్నద్ధం అవుతున్నారు.



వరినాట్లు వేయడానికి ట్రాక్టర్‌తో దమ్ము చేస్తున్న దృశ్యం

ఈ ఏడాది మే నెలలో సాధారణానికి మించి వర్షాలు పడడంతో జలాశయాల్లోకి, చెరువుల్లోకిఇ బాగానే నీరు చేరింది. జూన్‌లో సాధారణ వర్షం పడడంతో రైతులు ఖరీఫ్ పంటల సాగుకు పొలాలను సిద్ధం చేసుకున్నారు. మెట్ట భూముల్లో అపరాలు, చిరుధాన్యాలు, నూనె గింజలపంటలు వేసుకున్నారు. పల్లం (మాగాణి) భూముల్లో వరినాట్లు వేసే సమయాలకు అనుగుణంగా జూన్ నెలాఖరు నుంచి ఈ నెల రెండో వారం వరకు వరి నారుమడుల్లో విత్తనాలు చల్లారు. వరి నాట్లకు అనువైన పరిస్థితులు నెలకొనడంతో ముందుగా ఆకుమడులు వేసిన అన్నదాతలు దమ్ముల్లో నిమగ్నమయ్యారు. వాస్తవానికి ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో వర్షాలు సకాలంలోనే పడినప్పటికీ, ఆకుమడులు వేసిన తరువాత, వారం రోజుల క్రితం వరకు తీవ్రమైన ఎండలతో వర్షాభావ ఛాయలు కనిపించడంతో రైతులు ఆందోళనకు గురయ్యారు. ఇటువంటి తరుణంలో ఉపరితల ఆవర్తనం, అల్పపీడనం ఏర్పడి వర్షాలు పడుతుండడంతో రైతులు ఊపిరి పీల్చుకున్నారు. వర్షాలు ఆశాజనంగా కురుస్తుండడంతో జలాశయాల్లోకి సమృద్ధిగా నీరు చేరుతున్నది. పంట పొలాలు వర్షం నీటికళతో కళకళలాడుతున్నాయి. ఈ వారంలో పెద్దేరు, రైవాడ, కోనాం రిజర్వాయర్ల నుంచి కాలువలకు నీటిని విడుదల చేయనుండడంతో వరినాట్లు వేయడానికి దమ్ముపనులు ... మిగతా 8వ పేజీలో

హరిత పాఠశాలలు



అనకాపల్లి మండలం మామిడిపాలెం జడ్పీ ఉన్నత పాఠశాలలో గ్రీన్ పాస్‌పోర్టులు పొందిన విద్యార్థులు

- ప్రభుత్వ విద్యాలయాల్లో పచ్చదనం పెంపు
- ప్రతి విద్యార్థి ఒక్కో మొక్కను నాటి.. మూడేళ్లపాటు సంరక్షించాలి
- జిల్లాలోని పాఠశాలల్లో 1.18 లక్షల మొక్కలు నాటేందుకు ప్రణాళిక
- విద్యార్థులకు 'గ్రీన్ పాస్‌పోర్ట్' కార్డులు

(అనకాపల్లి- ఆంధ్రజ్యోతి)

పాఠశాలల ఆవరణలు, పరిసరాల్లో పచ్చదనం పెంపు కోసం మొక్కల పెంపకంపై విద్యార్థులకు అవగాహన కల్పించి, వారిని భాగస్వాములు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణ ప్రణాళికను అమలు చేస్తున్నది. పాఠశాలల్లో నాలుగో తరగతి నుంచి పదో తరగతి వరకు చదువుతున్న ప్రతి విద్యార్థి కనీసం ఒక మొక్కను నాటి మూడేళ్లు సంరక్షించాలనే వినూత్న కార్యక్రమానికి రాష్ట్ర మానవ వనరుల శాఖ మంత్రి నారా లోకేశ్ శ్రీకారం చుట్టారు. ఆయా వివరాల నమోదు కోసం ప్రతి విద్యార్థికి గ్రీన్ పాస్‌పోర్ట్‌ను అందిస్తున్నారు. జిల్లాలో అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో ఈ ఏడాది 1.18 లక్షల మొక్కలు నాటించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. జిల్లాలోని 1,955 పాఠశాలల్లో ... మిగతా 8వ పేజీలో

జడ్పీ బిల్లులకు మోక్షం

గత ఆర్థిక సంవత్సరం ఉమ్మడి జిల్లాలో 400 పనులు మంజూరు

- రూ.20 కోట్లు అంచనా
- పూర్తయిన పనులకు బిల్లులు చెల్లించకపోవడంతో సభ్యుల ఆందోళన
- ఎట్టకేలకు సుమారు 300 పనులకు సంబంధించి రూ.11.75 కోట్లు కాంట్రాక్టర్ల ఖాతాల్లో జమ

విశాఖపట్నం, జూలై 24 (ఆంధ్రజ్యోతి):

జిల్లా ప్రజా పరిషత్ సాధారణ నిధులతో చేపట్టిన పనులకు ఎట్టకేలకు బిల్లులు మంజూరుచేశారు. గత ఏడాది ఏప్రిల్ నుంచి చేసిన పనులకు సంబంధించి సుమారు రూ.11.75 కోట్లు కాంట్రాక్టర్ల ఖాతాలకు జమ అయ్యాయి. సాధారణ నిధులతో చేపట్టిన పనులకు బిల్లులు కావడం లేదంటూ జడ్పీ సర్వసభ్య సమావేశం, స్టాండింగ్ కమిటీ సమావేశాల్లో సభ్యులు ఆందోళన వ్యక్తం చేస్తూ వస్తున్నారు. ఈ నేపథ్యంలో గత నెల వరకూ అప్‌లోడ్ చేసిన పనులకు సంబంధించి బిల్లులు మంజూరుకావడంతో అధికారులు ఊపిరిపీల్చుకున్నారు.

గత వైసీపీ ప్రభుత్వం స్థానిక సంస్థలైన గ్రామ పంచాయతీ, మండల పరిషత్, జడ్పీ నిధుల వినియోగంపై అనేక ఆంక్షలు విధించింది. చివరకు కేంద్రం నుంచి వచ్చే ఆర్థిక సంఘం నిధులను ఇతర అవసరాలకు మళ్లించింది. దీంతో పనులు చేపట్టేందుకు కాంట్రాక్టర్లు ముందుకురాలేదు. గత ఏడాది ఏప్రిల్ అంటే ఎన్నికల సమయం నుంచి పనులను ప్రజా ప్రతినిధులు ప్రతిపాదించగా, కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో కాంట్రాక్టర్లు ముందుకువచ్చారు. జడ్పీటీసీ సభ్యులు తమ మండల పరిధిలో రోడ్లు, మరమ్మతులు, మురుగుకాల్వల నిర్మాణానికి సాధారణ నిధులు కేటాయిస్తుంటారు. గత ఆర్థిక సంవత్సరం ఉమ్మడి విశాఖపట్నం జిల్లాలో సుమారు రూ.20 కోట్ల సాధారణ నిధులతో 400 పనులు మంజూరుచేశారు. పనులు చేపట్టిన కాంట్రాక్టర్లు బిల్లులను సీఎఫ్ఎంఎస్‌కు అప్‌లోడ్ చేసినా మంజూరు కాలేదు. దీంతో జడ్పీ సమావేశాలు, స్టాండింగ్ కమిటీ సమావేశాల్లో పదేపదే సభ్యులు ప్రస్తావిస్తూ వస్తున్నారు. బిల్లులు మంజూరు కాకపోవడంతో కొందరు కాంట్రాక్టర్లు పనులు నిలిపివేశారు. ఈ నేపథ్యంలో మొత్తం 300 పనులకు సంబంధించి రూ.11.75 కోట్లు కాంట్రాక్టర్ల ఖాతాకు జమ చేశారు. గత నెలాఖరు వరకూ చేసిన పనులకు బిల్లులు మంజూరయ్యాయని జడ్పీ సీఈవో పి.నారాయణమూర్తి తెలిపారు. గత ఆర్థిక సంవత్సరంలో మంజూరుచేసిన మిగిలిన పనులను కూడా వెంటనే ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని ఇంజనీరింగ్ అధికారులకు ఆదేశాలు ఇచ్చామన్నారు.



ఎస్.రాయవరం మండలం గోకులపాడు శ్మశానవాటికలో నిర్మించిన షెల్టర్

ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ప్రతిపాదనలు

ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2025-26)లో జడ్పీ సాధారణ నిధులతో చేపట్టబోయే పనుల కోసం ప్రతిపాదనలు సిద్ధం చేయనున్నారు. గత ఏడాది బిల్లులు మంజూరుకావడంతో 2025-26 సంవత్సరానికి సంబంధించిన పనులపై ఈనెల 26వ తేదీన జరగనున్న స్టాండింగ్ కమిటీ సమావేశాల్లో ప్రస్తావించాలని సభ్యులు భావిస్తున్నారు.

గోవాడను ప్రభుత్వం ఆదుకోవాలి

- ఆర్థిక ఇబ్బందుల్లో షుగర్ ఫ్యాక్టరీ
- చెరకు రైతులకు రూ.28 కోట్లు బకాయిలు
- వచ్చే సీజన్‌కు ఫ్యాక్టరీని సన్నద్ధం చేయడానికి రూ.13 కోట్లు, కార్మికుల బకాయిలు, వర్కింగ్ క్యాపిటల్ కోసం మరో రూ.16 కోట్లు అవసరం
- మొత్తం రూ.57 కోట్లు మంజూరు చేయాలని కలెక్టర్ ద్వారా రాష్ట్ర ప్రభుత్వానికి ప్రతిపాదనలు
- 'ఆంధ్రజ్యోతి'తో ఫ్యాక్టరీ ఎండీ డి.వెంకటేశ్వరరావు



డి.వెంకటేశ్వరరావు, గోవాడ షుగర్స్ ఎండీ

చోడవరం, జూలై 24 (ఆంధ్రజ్యోతి):

గోవాడ (చోడవరం) సహకార చక్కెర కర్మాగారం మనుగడ కోసం రూ.57 కోట్లు అవసరమని రాష్ట్ర ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపినట్టు ఫ్యాక్టరీ ఎండీ డి.వెంకటేశ్వరరావు తెలిపారు. గురువారం ఆయన 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడుతూ, రానున్న సీజన్‌లో ఫ్యాక్టరీలో క్రషింగ్ చేయాలన్న సంకల్పంతోనే ఉన్నామని, ప్రభుత్వ నుంచి సహకారం అందుతుందని ఆశతో ఉన్నామని తెలిపారు. 2923-24 సీజన్‌కు సంబంధించి చెరకు రైతులకు బకాయిలు పూర్తిగా చెల్లించామని, 2024-25 సీజన్‌లో ఫ్యాక్టరీకి లక్షా తొమ్మిది వేల టన్నుల చెరకును రైతులు సరఫరా చేయగా, ఇందుకు సంబంధించి సుమారు రూ.34 కోట్లకుగాను, ఇంతవరకు రూ.6 కోట్లు చెల్లించామని చెప్పారు. మిగిలిన బకాయిలు రూ.28 కోట్లుతోపాటు వచ్చే సీజన్‌కు ఫ్యాక్టరీని సిద్ధం చేయడానికి వివిధ పనుల నిమిత్తం రూ.13 కోట్లు, కార్మికులకు వేతన బకాయిలతోపాటు వచ్చే సీజన్‌లో చెరకు సరఫరా చేసిన వెంటనే రైతులకు చెల్లింపులు జరపడానికి రూ.16 కోట్లు.. మొత్తం రూ.57 కోట్లు మంజూరు చేయాలని జిల్లా ... మిగతా 8వ పేజీలో

బార్క్ నిర్వాసితులకు నష్టపరిహారం

- డి.పట్టా భూములకు ఎకరాకు రూ.20 లక్షలు
- వారంలో చెల్లింపులు ప్రారంభం
- అనకాపల్లి ఆర్డీవో షేక్ ఆయిషా



నిర్వాసితుల జాబితాను రైతులకు చూపుతున్న ఆర్‌డీఓ ఆయిషా

అచ్యుతాపురం, జూలై 24 (ఆంధ్రజ్యోతి): బాబా ఆటమిక్ రీసెర్చ్ సెంటర్ (బార్క్) నిర్వాసితులకు ఎకరాకు రూ.20 లక్షల చొప్పున ప్రభుత్వం పరిహారం ప్రకటించిందని, జాబితాల్లో పేర్లు వున్న వారందరికీ వారంలోగా చెల్లింపులు ప్రారంభిస్తామని అనకాపల్లి ఆర్డీఓ షేక్ ఆయిషా తెలిపారు. గురువారం దొప్పెర్ల, రావిపాలెం బార్క్ నిర్వాసితులతో ఆమె సమావేశమయ్యారు. అయితే తమకు 2013 భూ సేకరణ చట్టం ప్రకారం నష్టపరిహారంతోపాటు పునరావాసం, ఉపాధి కల్పించాలని నిర్వాసితులు డిమాండ్ చేశారు. ఇందుకు ఆర్డీఓ స్పందిస్తూ.. ఈ రెండు గ్రామాల్లో సేకరిస్తున్నది డి.పట్టా భూములు అయినందువల్ల ఆ చట్టం వర్తించదని తెలిపారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ సత్యనారాయణ, డీటీ శ్యామ్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

చైన్ స్నాచింగ్ ముఠా ఆటకట్టు

- ముగ్గురిని అరెస్టు చేసిన పోలీసులు
- ఒంటరిగా వెళుతున్న మహిళలే లక్ష్యంగా తొమ్మిదిచోట్ల చోరీలు
- 26.01 తులాల బంగారు ఆభరణాలు, మూడు ద్విచక్ర వాహనాలు స్వాధీనం

కశింకోట, జూలై 24 (ఆంధ్రజ్యోతి):

రహదారిపై ఒంటరిగా వెళుతున్న మహిళలను లక్ష్యంగా చేసుకొని చైన్ స్నాచింగ్ (మెడలో నుంచి బంగారం గొలుసులను లాక్కొని పారిపోవడం)కు పాల్పడుతున్న ముగ్గురిని స్థానిక పోలీసులు అరెస్టు చేశారు. ఇందుకు సంబంధించి పోలీసు స్టేషన్‌లో గురువారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో అనకాపల్లి డీఎస్పీ ఎం.శ్రావణి వివరాలను వెల్లడించారు.

తూర్పుగోదావరి జిల్లా అనపర్తి మండలం కొప్పవరం గ్రామానికి చెందిన కర్రి నానిరెడ్డి అక్కడ ఇంటర్మీడియట్ వరకు చదువుకొని తరువాత తల్లిదండ్రులతో కలిసి ఉపాధి నిమిత్తం నర్సీపట్నానికి వలస వచ్చాడు. చుట్టుపక్కల గ్రామాల్లో ప్లాస్టిక్, స్టీల్ సామాన్లు విక్రయించాడు. తరువాత నర్సీపట్నంలో హోమ్ నీడ్స్ పేరుతో షాపు ఏర్పాటు చేసి నష్టపోయాడు. వ్యాపారం కోసం చేసిన అప్పులు చెల్లించలేక, అక్రమంగా డబ్బు సంపాదించాలని ... మిగతా 8వ పేజీలో



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న డీఎస్పీ ఎం.శ్రావణి. చిత్రం పోలీసు అధికారులు, నిందితులతోపాటు వారి నుంచి స్వాధీనం చేసుకున్న బంగారు ఆభరణాలు

ఆలయ స్థలంలోకి వెళ్లొద్దు

- ధర్మకర్తకు తహసీల్దార్ ఆదేశం
- అనుమతులు లేకుండా చెట్లు ఎందుకు నరికేశారని నిలదీత

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

పాయకరావుపేట రూరల్, జూలై 24 (ఆంధ్రజ్యోతి):

మండలంలోని శ్రీరాంపురంలో సీతారామస్వామి ఆలయానికి చెందిన భూమిలోకి వెళ్లవద్దని, ఎటువంటి పనులు చేపట్టవద్దని తహశీల్దార్ ఆది మహేశ్వరరావు స్పష్టం చేశారు. 'ఆలయ స్థలం అన్యాక్రాంతం' శీర్షికన గురువారం 'ఆంధ్రజ్యోతి'లో వెలువడిన వార్తకు స్పందించిన రెవెన్యూ, దేవదాయ శాఖ అధికారులు శ్రీరాంపురం వెళ్లి.. సర్వే నంబరు 75/2 లో చదును చేసిన భూమిని పరిశీలించారు. స్థలంలో కొబ్బరి చెట్లు నరికి వేయడాన్ని గుర్తించిన తహశీల్దార్.. వాల్టా చట్టం ప్రకారం అనుమతులు లేకుండా చెట్లు ఎలా నరికి వేశారని ఆలయ ధర్మకర్తను ప్రశ్నించారు. భూమిపై హక్కుకు సంబంధించి ధ్రువపత్రాలు ఏమైనా వుంటే చూపించాలని, అప్పటి వరకు భూమిలోకి వెళ్లవద్దని ధర్మకర్తకు స్పష్టం చేశారు. ఈ స్థలంలో బోర్డు ఏర్పాటు చేయాలని రెవెన్యూ ... మిగతా 8వ పేజీలో



చదును చేసిన రామాలయం స్థలాన్ని పరిశీలిస్తున్న తహశీల్దారు మహేశ్వరరావు, దేవదాయ శాఖాధికారి దివ్య, సిబ్బంది

ఎప్పుడు.. ఏ ప్రమాదం జరిగేనో?

» శిథిలస్థితికి చేరిన కొండవారపాలెం పాఠశాల భవనం.. » రాలుతున్న పెచ్చులు.. » ఆందోళనలో విద్యార్థులు, తల్లిదండ్రులు


కూలడానికి సిద్ధంగా ఉన్న కొండవారపాలెంలోని పాఠశాల భవనం

రాంబిల్లి, జూలై 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జడ్.చింతువా పంచాయతీ కొండవారపాలెం ప్రాథమిక పాఠశాల భవనం ఏ సమయంలోనైనా కూలిపోవచ్చునని విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. ఎన్నో ఏళ్ల క్రితం నిర్మించిన ఈ పాఠశాల భవనం పూర్తిగా శిథిలమైంది. పాఠశాల భవనం గోడలు బీటలు వారాయి. శ్లాబ్, సన్‌సేడ్, గోడ పెచ్చులు ఊడి పడిపోతున్నాయి. శ్లాబ్, గోడల నుంచి ఇనుప ఊసలు బయటకు వచ్చి మరింత ప్రమాదకరంగా మారాయి. పాఠశాల భవనం పరిస్థితి ప్రమాదకరంగా మారడంతో పక్కనే ఉన్న అంగన్‌వాడీ భవనంలో పాఠశాలను నడుపుతున్నారు. శిథిలమైన భవనాన్ని తొలగించాలని విద్యార్థుల తల్లిదండ్రులు డిమాండ్ చేస్తున్నారు. నూతన పాఠశాల భవనాన్ని నిర్మించాలని గత పాలకులు, అధికారులకు విన్నవించుకున్నా పట్టించుకోలేదని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల గ్రామస్థులు ఈ పాఠశాల దుస్థితిని ఫొటోలు తీసి ట్విట్టర్‌లో మంత్రి నారా లోకేశ్‌కు పంపించారు. మంత్రి లోకేశ్ స్పందించి, తగిన చర్యలు తీసుకోవాలని జిల్లా ఉన్నతాధికారులకు ఆదేశాలు చేసినట్టు గ్రామస్థులు తెలిపారు. శిథిలమై కూలడానికి సిద్ధంగా ఉన్న పాఠశాల భవనాన్ని తొలగించి, నూతన భవనాన్ని ఏర్పాటు నిర్మించాలని కొండవారపాలెం గ్రామస్థులు కోరుతున్నారు.


పాఠశాల భవనం శ్లాబ్ పెచ్చులు ఊడి కిందకు పడిన దృశ్యం

అశోక్‌గజపతిరాజును కలిసిన పప్పల, ప్రగడ


అశోక్‌గజపతిరాజుకు పుష్పగుచ్ఛం ఇస్తున్న మాజీ ఎమ్మెల్సీ పప్పల చలపతిరావు, ప్రగడ నాగేశ్వరరావు

ఎలమంచిలి, జూలై 24 (ఆంధ్రజ్యోతి): గోవా గవర్నర్‌గా నియమితులైన పి.అశోక్‌గజపతిరాజును గురువారం ఆయన నివాసంలో మాజీ ఎమ్మెల్సీ పప్పల చలపతిరావు, రాష్ట్ర రహదారుల కార్పొరేషన్ చైర్మన్ ప్రగడ నాగేశ్వరరావు మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయనకు జ్ఞాపికను అందజేశారు. కార్యక్రమంలో ఎలమంచిలి నియోజకవర్గానికి చెందిన పలువురు నేతలు కూడా అశోక్‌గజపతిరాజును కలిశారు.

లోవపాలెంలో వైరల్ జ్వరాలు విజృంభణ

» రాంబిల్లి పీహెచ్‌సీలో అందని వైద్య సేవలు

» ప్రైవేటు ఆస్పత్రులను ఆశ్రయిస్తున్న బాధితులు

రాంబిల్లి, జూలై 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జడ్‌చింతువా పంచాయతీ శివారు లోవపాలెం గ్రామంలో వైరల్ జ్వరాలు ప్రబలాయి. గ్రామంలో పలు ఇళ్లలో కుటుంబ సభ్యులంతా వైరల్ జ్వరాలతో మంచాన పడ్డారు. గ్రామంలో పారిశుధ్యం అధ్వానంగా ఉందని, డ్రైనేజీ వ్యవస్థ లేకపోవడంతో వాడుక నీరు సీసీరోడ్డు పైనే ప్రవహిస్తుండడంతో దోమలు వ్యాప్తి చెందిన రోగాల బారిన పడుతున్నామని గ్రామస్థులు వాపోతున్నారు. వైరల్ జ్వరాల బారిన పడి రోగులు రాంబిల్లి, అచ్యుతాపురం, అనకాపల్లి, విశాఖపట్నంలోని ఆసుపత్రులకు వెళ్లి వైద్యసేవలు పొందుతున్నారని గ్రామస్థులు తెలిపారు. జ్వరాలతో బాధపడుతున్న వారు రాంబిల్లి పీహెచ్‌సీకి వెళ్లినా వైద్య సేవలు అందించడం లేదని జ్వర బాధితులు ఆరోపించారు. తప్పనిసరి పరిస్థితుల్లో అనకాపల్లి, అచ్యుతాపురం, విశాఖపట్నంలకు వెళ్లి వేలాది రూపాయలు ఖర్చు పెట్టి వైద్య సేవలు పొందాల్సి వస్తుందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. పేదలు స్థానికంగా ఉంటున్న ఆర్ఎంపీ డాక్టర్లను ఆశ్రయించి వైద్యసేవలు పొందాల్సిన పరిస్థితి వచ్చిందని వారు వాపోతున్నారు. వైద్య ఆరోగ్య శాఖ జిల్లా అధికారులు స్పందించి గ్రామంలో జ్వర బాధితులకు పూర్తి స్థాయిలోఽ వైద్య సేవలు అందించే విధంగా చర్యలు తీసుకోవాలని లోవపాలెం గ్రామస్థులు కోరుతున్నారు.


విశాఖలోని ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న లోవపాలెం బాలుడు

చంద్రబాబు పాలనలోనే రాష్ట్రాభివృద్ధి

» టీడీపీ రాష్ట్ర కార్యదర్శి రమేష్ కుమార్

అచ్యుతాపురం, జూలై 24 (ఆంధ్రజ్యోతి):ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పాలనలోనే రాష్ట్రాభివృద్ధి జరుగుతుందని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి రాజాన రమేష్ కుమార్ అన్నారు. శుక్రవారం మోసయ్యపేటలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమన్ని నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల హామీలను నెరవేర్చడంలో కూటమి ప్రభుత్వం ముందుందన్నారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు వీలా తులసీరామ్, ధర్మిరెడ్డి సన్యాసినాయుడు (బాబు), కర్రి రమణ, పుర్రే రవియాదవ్, తదితరులు పాల్గొన్నారు.


అచ్యుతాపురం: మోసయ్యపేటలో ప్రచారం చేస్తున్న టీడీపీ శ్రేణులు

అచ్యుతాపురం రూరల్‌లో..

మండలంలోని ఆవసోమవరంలో గురువారం సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా తెలుగుదేశం నేతలు ఇంటింటికీ వెళ్లి కరపత్రాలను పంపిణీ చేశారు. టీడీపీ రాష్ట్ర కార్యదర్శి రాజాన రమేష్, టీడీపీ మండల అధ్యక్షుడు వీలా తులసీరాం తదితరులు కూటమి ప్రభుత్వం అమలు చేసిన పథకాలను వివరించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు పతివాడ చిన్నయ్యనాయుడు, కోలా మహేష్, దేశంశెట్టి రమణ, సిరసపల్లి రమణ తదితరులు పాల్గొన్నారు.

రాంబిల్లిలో..

మండలంలోని జడ్ చింతువా పంచాయతీ నేవీ కాలనీలో గురువారం సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమాన్ని తెలుగుదేశం పార్టీ నాయకులు నిర్వహించారు. ఈ సందర్భంగా తెలుగుయువత మండల అధ్యక్షుడు ఎరిపల్లి అజయ్, నాయకులు కాలనీలోని ఇంటింటికి వెళ్లి ప్రజలను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. కూటమి ప్రభుత్వ ఏడాది పాలనలో అందించిన సంక్షేమ పథకాలను, భవిష్యత్తులో అమలు చేయబోయే పథకాల గురించి వివరించారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు వెంకటరావు, తదితరులు పాల్గొన్నారు.

ఎలమంచిలిలో..

కూటమి ప్రభుత్వంలో అన్ని వర్గాల ప్రజలకు రెట్టింపు అభివృద్ధి, సంక్షేమ పథకాలను అమలు చేసిందని టీడీపీ పట్టణ అధ్యక్షుడు గొర్లె నానాజీ అన్నారు. గురువారం మునిసిపాలిటీలోని 16వ వార్డులో సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమంలో భాగంగా ఇంటింటికి తిరిగి ఏడాది పాలనపై ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా నేతలు మాట్లాడుతూ. ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌ల దూరదృష్టితో ఎన్నో సంక్షేమ పథకాల రూపకల్పన చేసి ప్రజలకు అందిస్తున్నారన్నారు. ఏడాది పాలనలో సాధించిన ఘనతను వివరిస్తూ కరపత్రాలను అందించారు. ఈ సందర్భంగా స్థానిక సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నేతలు రాజన సూర్యనాగేశ్వరరావు, కరణం రవికుమార్, సేనాపతి రాజామహేష్, దాడి రమేష్, కార్యకర్తలు పాల్గొన్నారు.

పాయకరావుపేటలో..

పేదల సంక్షేమమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం ఎన్నో పథకాలను అమలు చేస్తోందని టీడీపీ పట్టణ అధ్యక్షుడు యాళ్ల వరహాలబాబు అన్నారు. గురువారం పట్టణంలోని బృందావనం, లింగాలతోట కాలనీల్లోని పలు వీధుల్లో టీడీపీ నాయకులు ఇంటింటికి తిరిగి ప్రభుత్వం అమలుచేస్తున్న సంక్షేమ పథకాల కరపత్రాలను ప్రజలకు పంపిణీ చేశారు. అనంతరం కూటమి ప్రభుత్వం పనితీరుపై ప్రజలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వరహాలబాబు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టినప్పటి నుంచి అభివృద్ధి పరుగులు పెడుతోందన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు లెక్కల గోవిందు, జూరెడ్డి ప్రసాద్, గొల్లపల్లి నాగు, చిలుకూరి పేర్రాజు తదితరులు పాల్గొన్నారు.


ఎలమంచిలి 16వ వార్డులో కరపత్రాలు అందజేస్తున్న టీడీపీ నేతలు


పాయకరావుపేటలో ఇంటింటికి కరపత్రాలు అందజేస్తున్న టీడీపీ నాయకులు

డ్వాక్రా మహిళలు ఆర్థిక పరిపుష్టి సాధించాలి

» చైర్‌పర్సన్ రమాకుమారి


అర్బన్ మార్కెట్‌ను సందర్శించిన చైర్‌పర్సన్ రమాకుమారి

ఎలమంచిలి, జూలై 24 (ఆంధ్రజ్యోతి): డ్వాక్రా మహిళలు ప్రభుత్వ ప్రోత్సాహంతో ఆర్థికాభివృద్ధి సాధించాలని మునిసిపల్ చైర్‌పర్సన్ రమాకుమారి అన్నారు. గురువారం పట్టణంలోని తులసీనగర్‌లో మెప్మా ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అర్బన్ మార్కెట్‌ను ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా రమాకుమారి మాట్లాడుతూ వినియోగదారులకు నాణ్యతతో ఆకట్టుకునేలా వస్తువులను తయారు చేసి మార్కెట్‌లో విక్రయించాలన్నారు. డ్వాక్రా మహిళలంతా మార్కెట్‌ను అందిపుచ్చుకుని ఇంటికో లక్షాధికారి కావాలనే ప్రభుత్వ లక్ష్యాన్ని సాధించాలన్నారు. ఈ కార్యక్రమంలో మెప్మా సీఎంఎం పద్మ, స్థానిక నేతలు ఆడారి రమణబాబు, ఆడారి ఆదిమూర్తి, సీఓలు సుధ, సత్య, కృష్ణవేణి, ఆర్పీలు, డ్వాక్రా మహిళలు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కార్యకర్త నియామకంపై పల్లాకు ఫిర్యాదు

అచ్యుతాపురం రూరల్, జూలై 24, (ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ కార్యకర్త నియామకంలో తనకు న్యాయం చేయాలంటూ తిమ్మరాజుపేటకు చెందిన మంత్రి సునీత టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావును కోరారు. గురువారం సునీతకు మద్దతుగా నిలిచిన టీడీపీ నాయకులు గాజువాకలో పల్లాను కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. తిమ్మరాజుపేటకు చెందిన సునీతకు పోస్టు కేటాయించాలని కూటమి పార్టీ నాయకులు ఎమ్మెల్యేకు సిఫారసు చేసినప్పటికీ, వైసీపీ నుంచి జనసేనలో చేరిన బీసీ వర్గానికి చెందిన వ్యక్తి భార్యను ఎంపిక చేయడం వెనుక రాజకీయ కోణం ఉందని ఫిర్యాదు చేశారు. ఎంపిక చేసిన మహిళ ఎలమంచిలికి చెందిన వ్యక్తి కావడం, తహసీల్దార్ కార్యాలయం నుంచి సరైన ధ్రువపత్రాలు లేకుండానే పోస్టు ఎంపిక చేశారని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు కర్రి ఆదిబాబు, శరగడం శివబాపునాయుడు, మళ్ల చినబాబు, భద్రరాజులు, నాయుడు తదితరులు పాల్గొన్నారు.


పల్లా శ్రీనివాసరావుకు వినతిపత్రం అందజేస్తున్న తిమ్మరాజుపేట గ్రామ పెద్దలు

వైసీపీకి రాజీనామా చేసినట్టే..

మరోసారి స్పష్టం చేసిన బొలిశెట్టి గోవిందరావు



ఎస్.రాయవరం, జూలై 24 (ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రాథమిక సభ్యత్వానికి, పార్టీ మండల అధ్యక్ష పదవికి చేసిన రాజీనామాకు కట్టుబడి ఉన్నానని తాత్కాలిక మండలాధ్యక్షుడు బొలిశెట్టి గోవిందరావు స్పష్టం చేశారు. స్థానిక ఎంపీపీ కార్యాలయంలో గురువారం సాయంత్రం నిర్వ హించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈనెల 20న తాను చేసిన రాజీనామా ప్రకటనకే కట్టుబడి ఉన్నాన న్నారు. వైసీపీ కేడర్, పార్టీ పెద్దల ఒత్తిడికి కాస్త వెనక్కి తగ్గాన ని, పార్టీలో తనకు జరిగిన అన్యాయానికి ఆ పార్టీలో కొనసాగేందుకు అసలు ఇష్టం లేదన్నారు. రాజీనామా నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవడం ఇష్టం లేక జగన్‌ను కూడా కలవాలనుకోవడం లేదన్నారు. ఎవరు ఒత్తిడి చేసిన ఇక రాజీనామా విషయంలో మార్పు ఉండదని గోవిందరావు స్పష్టం చేశారు. తన రాజీనామా పత్రాన్ని కూడా శుక్రవారం వైసీపీ జిల్లా అధ్యక్షుడికి అందించడం జరుగుతుందని ఆయన తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

మునగపాక, జూలై 24 (ఆంధ్రజ్యోతి): స్థానిక విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో పలు గ్రామాలకు ఈ నెల 25వ తేదీన విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనుందని ఏపీఈపీడీసీఎల్ ఈఈ రామకృష్ణ తెలిపారు. సబ్ స్టేషన్‌లో మరమ్మతు పనుల్లో భాగంగా శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు సరఫరా నిలిపేస్తామని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

శాకంబరి అలంకరణలో దుర్గాలమ్మ

» ఘనంగా బోనాలు జాతర

ఎలమంచిలి, జూలై 24 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని బజారువీధి దుర్గాలమ్మ అమ్మవారు గురువారం భక్తులకు శాకంబరిగా దర్శనమిచ్చారు. ఆషాఢమాసంలో అమ్మవారికి ఘటాలు, బోనాల జాతరను అంగరంగ వైభవంగా నిర్వహించారు. తెల్లవారు జాము నుంచి అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారి దర్శనానికి అధిక సంఖ్యలో భక్తులు తరలి రావడంతో ఆలయం కిటకిటలాడింది. జాతరను పురస్కరించుకుని ఆలయ పరిసర ప్రాంత వీధులన్నీ విద్యుత్ కాంతులతో సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. సాయంత్రం పాతవీధిలోని సూరిశెట్టి వారి గృహం నుంచి భారీ బాణసంచా కాల్చుతూ మహిళలు ఘటాలు, బోనాలను ఊరేగించారు. అనంతరం ఆలయం వద్ద పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.


శాకంబరి అవతారంలో దుర్గాలమ్మ అమ్మవారు


ఘటాలు, బోనాలను తీసుకువస్తున్న మహిళా భక్తులు

హాస్టల్ విద్యార్థులకు ఇబ్బంది కలగకూడదు

ఎంపీడీవో సీతారామరాజు


గొడిచెర్లలోబీసీ హాస్టల్‌ను తనిఖీ చేస్తున్న అధికారులు

నక్కపల్లి, జూలై 24 (ఆంధ్రజ్యోతి): బీసీ హాస్టల్‌లో చదువుకుంటున్న విద్యార్థులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని, మెనూ ప్రకారం భోజన సదుపాయం కల్పించాలని ఎంపీడీవో డీ సీతారామరాజు, ఈవోపీఆర్‌డీ చలపతిరావు ఆదేశించారు. గురువారం గొడిచెర్ల బీసీ బాలుర వసతి గృహాన్ని తనిఖీ చేశారు. మంచినీటికి ఇబ్బంది లేకుండా చూడాలని, హాస్టల్ పరిసరాలను పరిశుభ్రంగా వుంచాలని సిబ్బందికి సూచించారు. అనంతరం సంపద కేంద్రాన్ని తనిఖీ చేశారు. గ్రామంలో శానిటేషన్ పనులను పర్యవేక్షించారు. వారి వెంట మాజీ వైస్ ఎంపీపీ వైబోయిన రమణ, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

మోసయ్యపేటలో పారిశుధ్య పనులు ప్రారంభం

అచ్యుతాపురం జూలై 24 (ఆంధ్రజ్యోతి): మోసయ్యపేటలో పారిశుధ్య పనులు గురువారం నుంచి ప్రారంభమయ్యాయి. గ్రామంలో డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉండడంతో ఏమాత్రం వర్షం పడినా అచ్యుతాపురం జంక్షన్ పూర్తిగా మురికి నీటితో నిండిపోతోంది. సెజ్‌లోని కోహన్ లైఫ్ సైన్స్ లిమిటెడ్ సంస్థ మోసయ్యపేటలో సీఎస్ఆర్ నిధులతో డ్రైనేజీ వ్యవస్థ మెరుగు పరిచేందుకు ముందుకు వచ్చింది. గురువారం నుంచి పనులు ప్రారంభమయాయని ఉపసర్పంచ్ శ్రీనివాస యాదవ్ తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీఓ చిన్నారావు, కర్మాగారం ప్రతినిధులు పాల్గొన్నారు.

యోగద సత్సంగ ధ్యాన మండలి ప్రారంభం రేపు

పాయకరావుపేట, జూలై 24 (ఆంధ్రజ్యోతి) : స్థానిక జాతీయ రహదారిని ఆనుకుని ఉన్న చిట్టూరి మెట్రోలో యోగా సొసైటీ ఆఫ్ ఇండియా (రాంచీ) ఆధ్వర్యంలో యోగద సత్సంగ ధ్యాన మండలిని శనివారం ప్రారంభించనున్నామని ధ్యాన మందిరం అధ్యక్షుడు ఏఎస్ఆర్.శర్మ తెలిపారు. శనివారం సాయంత్రం 4.30 గంటలకు యోగా సొసైటీ ఆఫ్ ఇండియా ఉపాధ్యక్షుడు స్వామి శ్రీస్మరణానంతగిరి ప్రారంభించనున్నారన్నారు. ఈ కార్యక్రమానికి అందరు ఆహ్వానితులేనని ఆయన తెలిపారు.

హిందూ ధర్మ ఔన్నత్యం భవిష్యత్తు తరాలకు తెలియాలి

మునగపాక, జూలై 24 (ఆంధ్రజ్యోతి): హిందూ ధర్మం ఔన్నత్యం గురించి భవిష్యత్తు తరాలకు తెలియాల్సిన అవసరం ఎంతైనా ఉందని భగవద్గీత ప్రచారకర్త రాజశేఖర్ వెల్లడించారు. స్థానిక అయ్యప్పస్వామి ఆలయం వద్ద బుధవారం రాత్రి జరిగిన వీహెచ్‌పీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ హిందూ మతంలో ఉన్న ధర్మం గురించి విస్తృతంగా ప్రచారం జరగాలన్నారు. మండల శాఖ అధ్యక్షుడు శరగడం పరదేశినాయుడు అధ్యక్షతన జరిగిన సమావేశంలో జోగినాయుడు, పెంటకోట జగన్నాథంనాయుడు, మొల్లేటి సత్యనారాయణ పాల్గొన్నారు.

జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు ఇవ్వండి

నక్కపల్లి, జూలై 24 (ఆంధ్రజ్యోతి): అనకాపల్లి జిల్లాలో వున్న పాత్రికేయులందరికీ ఇళ్ల స్థలాలు మంజూరు చేసి, గృహాలను నిర్మించి ఇవ్వాలని కోరుతూ గురువారం రాష్ట్రమంత్రులను ఏపీయూడబ్ల్యూజే ప్రతినిధులు వినతిపత్రం అందజేశారు. అమరావతిలో గృహ నిర్మాణ, సమాచార శాఖా మంత్రి కొలుసు పార్థసారథి, రెవెన్యూ మంత్రి అనగాని సత్య ప్రసాద్‌లను ఏపీయూడబ్ల్యూజే జిల్లా ప్రధాన కార్యదర్శి కోరాడ చంద్రరావు, రాష్ట్ర ఎలక్ట్రానిక్ మీడియా అధ్యక్షుడు ఏచూరి శివ వినతిపత్రాలలు అందజేశారు. జర్నలిస్టులకు ఇళ్ల నిర్మాణం, ఇళ్ల స్థలాలపై త్వరలో మార్గదర్శకాలు వస్తాయని మంత్రులు చెప్పినట్టు చంద్రరావు చెప్పారు. అక్రిడిటేషన్ల మంజూరుపై కూడా త్వరలో ఆదేశాలు జారీ అవుతాయని ఆయన చెప్పారు.

రోడ్డు నిర్వాసితులకు పరిహారంగా టీడీఆర్‌లు వద్దు

అచ్యుతాపురం రూరల్, జూలై 24, (ఆంధ్రజ్యోతి): అనకాపల్లి-అచ్యుతాపురం రోడ్డు విస్తరణలో భూములను కోల్పోతున్న తమకు ఇచ్చే నష్టపరిహారం టీడీఆర్ బాండ్లుగా కాకుండా నగదు రూపంలో ఇవ్వాలని నిర్వాసితులు డిమాండ్ చేశారు. గురువారం మండలంలోని హరిపాలెం, తిమ్మరాజుపేటల్లో నష్టపరిహారంపై నిర్వాసితులతో సంతకాల సేకరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. 2013 భూసేకరణ చట్టం ప్రకారం పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. నిర్వాసితుల గోడును వినిపించుకోకపోతే ఉద్యమం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నిర్వాసిత సంఘ నాయకులు పాల్గొన్నారు.

సీతంపాలెంలో ఘనంగా పాండవుల పండుగ


సీతంపాలెంలో పాండవుల పండుగ జరుపుతున్న గ్రామస్థులు

నక్కపల్లి, జూలై 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సీతంపాలెంలో గురువారం పాండవుల పండుగను గ్రామస్థులు ఘనంగా జరుపుకున్నారు. ప్రతీ ఏటా ఖరీఫ్ సీజన్ సమయంలో వర్షాలు కురవాలని కోరుతూ పాండవుల పండుగను జరుపుకోవడం ఆనవాయితీగా వస్తోంది. గురువారం సాయంత్రం మహిళలు గ్రామంలో వున్న ఆంజనేయస్వామి, దుర్గాదేవి అమ్మవార్లకు ముందుగా జలాభిషేకం చేశారు. అనంతరం అమ్మవారి ఆలయానికి ఆనుకుని వున్న పాండవుల విగ్రహాలకు కూడా జలాభిషేకం చేసి, పసుపు, కుంకుమ, నైవేద్యాలు సమర్పించారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు నాగ అప్పలరాజు, గొర్ల గోవింద్, ప్రసాదుల సత్యనారాయణ, ప్రసాదుల సింహాద్రి, బొట్టా నూకరాజు, గదుల శ్రీను, గొర్ల శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

'బాల్య వివాహాలతో జీవితాలు నాశనం'

నక్కపల్లి, జూలై 24 (ఆంధ్రజ్యోతి): బాల్య వివాహాలు చేసుకోవడం వల్ల ఆడపిల్లల భవిష్యత్తు నాశనమవుతుందని జిల్లా బాలల పరిరక్షణ ప్రతినిధి డి.లోవరాజు చెప్పారు. మండలంలోని గొడిచెర్ల హైస్కూల్‌లో కిశోర బాలికలకు బాల్య వివాహాల వల్ల కలిగే అనర్థాల గురించి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ లింగ వివక్షత లేకుండా తల్లిదండ్రులు పిల్లలను పెంచాలని సూచించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం సత్యకుమార్, టీచర్స్ రమణ, కుమారి,కార్తీక్, ఏఎన్ఎం, ఆశలు తదితరులు పాల్గొన్నారు.

'బల్క్‌డ్రగ్స్‌పై ప్రజాభిప్రాయ సేకరణ రద్దు చేయాలి'

ఎస్.రాయవరం, జూలై 24 (ఆంధ్రజ్యోతి): బల్క్ డ్రగ్స్ పార్కును ఏర్పాటు చేసేందుకు ఆగస్టు 6న నక్కపల్లిలో నిర్వహించనున్న ప్రజాభిప్రాయ సేకరణను రద్దు చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు ఎం.అప్పలరాజు డిమాండ్ చేశారు. గురువారం మండలంలోని గుర్రాజుపేట రైతులతో కలిసి ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గుర్రాజుపేటలో అధికారులు నిర్వహించిన గ్రామసభలో రైతులు బల్క్ డ్రగ్స్ పరిశ్రమకు భూములిచ్చేది లేదని తేల్చి చెప్పారన్నారు. ప్రభుత్వం ఏకపక్షంగా నివేదికలో గ్రామాన్ని పొందుపరచడంపై ఆయన అభ్యంతరం వ్యక్తంచేశారు. సమావేశంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు సత్యనారాయణ, రైతులు పాల్గొన్నారు.

పారిశుధ్యంపై అధికారులు ప్రత్యేక డ్రైవ్

కోటవురట్ల, జూలై 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తంగేడు, జల్లూరు యండపల్లి గ్రామాల్లో పారిశుధ్యం మెరుగుకు అధికారులు చర్యలు తీసుకున్నారు. గురువారం ఆయా గ్రామాల్లో ఎంపీడీవో చంద్రశేఖర్. డిప్యూటీ ఎంపీడీవో కూర్మరావు, పంచాయతీ కార్యదర్శి రవికిరణ్ పర్యటించారు. గ్రామాల్లోని చెత్త, చెదారాన్ని పారిశుధ్య సిబ్బందితో తొలగింపజేశారు. అలాగే వర్షపు నీరు నిల్వ ఉన్న టైర్లు, నీరు నిల్ల ఉన్న ప్రాంతాల్లో లార్వాను పరిశీలించి, నీటిని తొలగింపజేవారు. పారిశుధ్యంపై ప్రజలకు అవగాహన కల్పించారు.

అవి ఆలయ భూములు కావు : ధర్మకర్త

పాయకరావుపేట రూరల్, జూలై 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని శ్రీరాంపురం సీతారామస్వామి ఆలయానికి చెందినవిగా చెబుతున్న భూములు ఆలయానివి కావని, అవి తమ పూర్వీకుల నుంచి తనకు సంక్రమించాయని ఆలయ ధర్మకర్త చించలపు వెంకటకృష్ణ తెలిపారు. గురువారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ తమ పూర్వీకులు ఆలయాన్ని నిర్మించి ధూప, దీప నైవేద్యాలు, ఏటా సీతారాముల కల్యాణోత్సవానికి భూమిని కేటాయించారే తప్ప ఆ భూములు ఆలయానికి రాసి ఇవ్వలేదన్నారు. అయితే రెవెన్యూ రికార్డుల్లో సీతారామ స్వామి ఆలయం భూములుగా నమోదయిందని, వాటిని మార్చాలని రెవెన్యూ అధికారులు, కలెక్టరుకు వినతిపత్రాలు ఇచ్చామన్నారు.

భక్తిశ్రద్ధలతో చౌడేశ్వరి అమ్మవారి జయంతి



ఘటాలను ఊరేగింపుగా ఆలయానికి తీసుకు వస్తున్న మహిళలు

అనకాపల్లి టౌన్, జూలై 24 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని చినరాజుపేటలో గల చౌడేశ్వరి సాంబశివ ఆలయంలో చౌడేశ్వరి అమ్మవారి జయంతిని గురువారం అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా పెద్ద సంఖ్యలో మహిళలు ఘటాలను తలపై పెట్టుకుని పురవీధుల గుండా ఊరేగింపుగా ఆలయానికి చేరుకున్నారు. అక్కడ అర్చకులు అమ్మవారికి విశేష పూజలు జరిపిన అనంతరం భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. అనంతరం 108 కలశాలు, పంచామృతాలతో అమ్మవారిని అభిషేకించారు. వివిధ ప్రాంతాల నుంచి భారీగా భక్తులు తరలి రావడంతో ఆలయ పరిసరాలు కోలాహలంగా మారాయి. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షులు రెడ్డి వరప్రసాద్, కార్యదర్శి మానెం సతీష్, కోశాధికారి బాసిన బాలగురాజీ, అలంక బెన్నయ్య, ముప్పన వాసు, సంతోష్, మాణిక్యం రామకృష్ణ, మావూరు అయ్యప్ప, బూడిద తాతాజీ, బూడిద శివ పాల్గొన్నారు.

కశింకోటలో వైభవోపేతంగా సత్తెమ్మతల్లి వేడుక



అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

కశింకోట, జూలై 24 (ఆంధ్రజ్యోతి) : మండలం కేంద్రమైన కశింకోట నుంచి వెదురుపర్తి గ్రామానికి వెళ్లే రహదారి సమీపంలో గల సత్తెమ్మతల్లి ఆలయంలో గురువారం పండుగను అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారికి ఉదయం నుంచి ప్రత్యేక పూజలు జరిపారు. రాష్ట్ర అర్బన్ ఫైనాన్స్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ పీలా గోవింద సత్యనారాయణ దర్శించుకున్నారు. ఆలయ ప్రతినిధులు ఆయనను శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో భక్తులతో పాటు పలువురు కూటమి నాయకులు పాల్గొన్నారు.

అరుంధతి నగర్‌లో ఘనంగా నూకాంబిక పండుగ

అనకాపల్లి టౌన్, జూలై 24 (ఆంధ్రజ్యోతి) : ఇక్కడి గవరపాలెం అరుంధతి నగర్‌లో గురువారం నూకాంబిక పండుగను ఘనంగా నిర్వహించారు. వేకువ జాము నుంచి అమ్మవారికి విశేష పూజలు జరిపిన అనంతరం భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. పసుపు, కుంకుమ, పండ్లు, కాయలను సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. పలువురు మహిళలు తలపై ఘటాలను పెట్టుకుని ఊరేగింపుగా వచ్చి సమర్పించారు. వైసీపీ ఎస్సీ సెల్ అధ్యక్షుడు పెట్ల నాగేశ్వరరావు ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకల్లో ఆ పార్టీ అనకాపల్లి నియోజకవర్గ సమన్వయకర్త మలసాల భరత్‌కుమార్, పట్టణ శాఖ అధ్యక్షుడు మందపాటి జానకిరామరాజు, 80వ వార్డు ఇన్‌చార్జి కేఎం నాయుడు, బొడ్డేడ శివ, కోరుకొండ రాఘవ తదితరులు పాల్గొన్నారు.

ఏఎంఏఎల్ కళాశాలలో 103 మంది రక్తదానం



రక్తదానం చేసినవారికి సర్టిఫికెట్లు అందిస్తున్న కొణతాల లక్ష్మీనారాయణ

కొత్తూరు, జూలై 24 (ఆంధ్రజ్యోతి) : ఇక్కడి ఏఎంఏఎల్ కళాశాలలో మేము సైతం- సమాజం కోసం సంస్థ, కళాశాల యాజమాన్యం సంయుక్త ఆధ్వర్యంలో గురువారం రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ డాక్టర్ గెల్లా జయబాబు మాట్లాడుతూ వరక్త సంఘం గౌరవ కార్యదర్శి కొణతాల లక్ష్మీనారాయణ (పెదబాబు) జన్మదిన వేడుకల్లో భాగంగా ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్టు చప్పారు. అనంతరం 103 మంది విద్యార్థుల రక్తాన్ని దానం చేశారు. అనంతరం పెదబాబు చేతుల మీదుగా వీరికి ప్రశంసాపత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ నిరంజన్, సూపరింటెండెంట్ అనురాధ, పలు శాఖాధిపతులు పాల్గొన్నారు.

నారుమడుల్లో జింక్ లోపాన్ని నివారించాలి



మార్టూరులో వరి పొలాలను సందర్శిస్తున్న వ్యవసాయాధికారులు

తుమ్మపాల, జూలై 24 (ఆంధ్రజ్యోతి) : అనకాపల్లి మండలం మార్టూరులో గురువారం పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. మండల వ్యవసాయాధికారి పి.రంగాచారి వరి నారుమడులను పరిశీలించి, రైతులకు పలు సూచనలు చేశారు. నారుమడుల్లో జింక్ లోపం అధికంగా ఉన్నట్టు గుర్తించామన్నారు. నివారణకు లీటరు నీటిలో జింక్ సల్ఫేట్ ఐదు గ్రాములు కలిపి పిచికారీ చేయాలన్నారు. పశుగ్రాసానికి యూరియా వడవద్దని తెలిపారు. అన్నదాత సుఖీభవ పథకాన్ని అర్హులంతా సద్వినియోగం చేసుకోవాల్సిందిగా కోరారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయాధికారులు శ్రావణి, జ్యోత్స్న, గ్రామ నాయకులు పాల్గొన్నారు.

బ్రిటీష్ సైనికాధికారుల సమాధుల స్థలంపై కన్ను!

నర్సీపట్నం, జూలై 24 (ఆంధ్రజ్యోతి) : బ్రిటీష్ సైనికాధికారుల స్థలం ఆక్రమణను మునిసిపల్, రెవెన్యూ అధికారులు అడ్డుకున్నారు. గురువారం సాయంత్రం స్థలం చుట్టు కట్టిన పచ్చ పరదాను హుటాహుటిన తొలగించారు. పట్టణ మెయిన్ రోడ్డునిను ఆనుకొని 46 సెంట్లు సమాధుల స్థలం ఉండేది. చుట్టూ దుకాణాలు కట్టుకోగా చివరకు 19 సెంట్లు మిగిలింది. ఈ స్థలాన్ని అల్లూరి స్మారక ప్రదేశంగా అభివృద్ధి చేయాలని చాలా ఏళ్లుగా డిమాండ్ ఉంది. బుధవారం గుర్తు తెలియని వ్యక్తులు స్థలం చుట్టూ పచ్చక్లాత్ కట్టారు. రెవెన్యూ అధికారులు కట్టించి ఉంటారని స్థానికులు భావించారు. ఒక పక్క న్యాయ సేవా ధికార సంస్థలో స్థలం పరిరక్షణ కోసం కేసు నడుస్తుంది. స్వయంగా న్యాయమూర్తి షియాజ్‌ఖాన్ బ్రిటీష్ సైనికాధికారుల స్థలాన్ని పరిశీలించి, పురావస్తు శాఖ, మునిసిపల్, రెవెన్యూ అధికారులకు రక్షణ చర్యలు చేపట్టాలని ఆదేశాలు జారీ చేశారు. సమాధుల స్థలానికి సంబంధించిన స్కెచ్, సరిహద్దు వివరాలు అందజేయాలని రెవెన్యూ అధికారులను పురావస్తు శాఖ ఏడీ షణ్ముఖరావు లిఖిత పూర్వంగా కోరారు. స్థలం తమ పరిధిలో ఉందని స్వయంగా పురావస్తుశాఖ ఏడీ ప్రకటించారు. అల్లూరి సాయుధ పోరాటానికి సాక్ష్యంగా ఉన్న బ్రిటీష్ సైనిక అధికారుల స్థలం పరిక్షణకు న్యాయమూర్తి ఆదేశాలతో అధికారులు చర్యలు తీసుకుంటుంటే. మరో వైపు పచ్చ పరదా కట్టి గుట్టుచప్పుడు కాకుండా దుకాణాల నిర్మాణానికి సాహసం చేయడం అందర్నీ విస్తుగొలిపింది. మునిసిపల్ కమిషనర్ సురేంద్ర, టౌన్ ప్లానింగ్ అధికారి ఫణి, సబ్ కలెక్టర్ కార్యాలయం సిబ్బంది దగ్గరుండి పరదాలు విప్పించారు.

సమస్యల సుడిలో జగనన్న కాలనీలు

- గత వైసీపీ పాలనలో ఆదరాబాదరాగా ఇళ్ల నిర్మాణాలు
- రోడ్లు, కాలువలు వంటివి లేకపోవడంతో నివాసితుల అవస్థలు
- చినుకు పడితే ఆయా ప్రాంతాలు చిత్తడి
- వాడుక నీటితో మరిన్ని కష్టాలు
- కూటమి ప్రభుత్వం దృష్టిసారించాలని వేడుకోలు



ఆరిపాక శివారు కొత్తపాలెం సమీపంలో గల జగనన్న కాలనీలో దుస్థితి

సబ్బవరం, జూలై 24 (ఆంధ్రజ్యోతి) : వైసీపీ ప్రభుత్వం మం డలంలోని పలు గ్రామాల్లో అట్టహాసంగా నిర్మించిన జగనన్న కాలనీలు అధ్వానంగా మారాయి. సరైన రోడ్లు, కాలువలు వంటి సౌకర్యాలు లేకపోవడంతో చినుకుపడితే ఆయా ప్రాంతాలు చిత్తడిగా మారి నివాసితులు ప్రత్యక్ష నరకాన్ని చూస్తున్నారు. కాలువలు లేకపోవడంతో చేసేది లేక ఇళ్లలోని వాడుక నీటిని పైకి వదిలేస్తున్నారు. దీంతో ఆయా ప్రాంతాలు మరింత దారుణంగా తయారవుతున్నాయి.

గత వైసీపీ ప్రభుత్వంలో మండలంలోని 24 పంచాయతీల పరిధిలో 28 లే-అవుట్లు అభివృద్ధి చేసి 2108 ప్లాట్లు ఏర్పాటు చేశారు. అందులో 2087 ఇళ్ల నిర్మాణాలు ప్రారంభించారు. ఇందులో



అంతకాపల్లిలో కాలువలు ఏర్పాటు చేయని జగనన్న కాలనీ

1168 ఇళ్లు మాత్రమే నిర్మాణాలు పూర్తికాగా, మిగిలినవి వివిధ దశల్లో ఉన్నాయి. అయితే ఏ గ్రామంలోనూ పూర్తిస్థాయిలో రోడ్లు, కాలువలన అప్పటి ప్రభుత్వం అభివృద్ధి చేయలేదు. దీంతో ఆయా కాలనీల్లో ఇళ్లు నిర్మిం చుకుని నివాసాలు ఉంటున్నవారి అవస్థలు తీవ్రంగా ఉన్నాయి. ముఖ్యంగా ఆరిపాక, అంతకాపల్లి, వం గలి, ఎ.సిరసపల్లి, గొర్లివానిపాలెం తదితర గ్రామాల్లోని లే-అవుట్లలో రోడ్ల దుస్థితి చెప్పనక్కర్లేదు. కాగా, ఈ కాలనీల్లో సమస్యలను హౌసింగ్ జేఈ ఎంఎస్ఎన్ రెడ్డి వద్ద ప్రస్తావించగా లే- అవుట్ల అభివృద్ధి సమయంలో ఏర్పాటు చేసిన గ్రావెల్ రోడ్లు చాలాచోట్ల వరదలకు కొట్టుకుపోయాయన్నారు. సీసీ కాలువలు మాత్రం నిర్మించలేదన్నారు. ప్రభుత్వం నిధులు మంజూరు చేస్తే రోడ్లు, కాలువలునిర్మిస్తామని స్పష్టం చేశారు.

అభివృద్ధి పనులకు అంతా సహకరించండి

- ప్రజలను కోరిన కలెక్టర్ విజయకృష్ణన్
- అనకాపల్లి - అచ్యుతాపురం రోడ్డు విస్తరణ నిర్వాసితులకు టీడీఆర్ బాండ్లు పంపిణీ



టీడీఆర్ బాండును అందజేస్తున్న కలెక్టర్ విజయకృష్ణన్, ఆర్డీవో ఆయిషా

అనకాపల్లి కలెక్టరేట్, జూలై 24 (ఆంధ్రజ్యోతి) : జిల్లా కేంద్రం అనకాపల్లి నుంచి అచ్యుతాపురం వరకు చేపడుతున్న రహదారి విస్తరణలో భాగంగా భూములు కోల్పోయి ముందుకు వచ్చిన బాధితులకు గురువారం కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్ టీడీఆర్ బాండ్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం చేపట్టే అభివృద్ధి పనులకు ప్రజలంతా సహకరించాలని కోరారు. అందరి భాగస్వామ్యంతోనే ఏదైనా సాధ్యమన్నారు. భూములు కోల్పోయిన ఇతర నిర్వాసి తులు కూడా సముఖత వ్యక్తం చేస్తూ తగిన దస్తావేజులతో ముందుకు వచ్చి టీడీఆర్ బాండ్లను తీసుకోవాలని ఆమె సూచించారు. అనంతరం అచ్యుతాపురం మండలం కొండకర్ల గ్రామానికి చెందిన కోసూరి నారాయణరావుకు, మునగపాక మండలం జేసీ అగ్రహారం గ్రామం కె.అనురాధకు టీడీఆర్ బాండ్లను కలెక్టర్ అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో షేక్ ఆయిషా, మునగపాక తహశీల్దార్ వి.సత్యనారాయణ, అచ్యుతాపురం తహశీల్దార్ జి.సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

చెర్లోపలి రైతుల దీర్ఘకాల సమస్యకు మోక్షం

- ఎమ్మెల్యే కొణతాల చొరవతో కూటమి ప్రభుత్వం ప్రత్యేక దృష్టి
- కేబినెట్‌లో వీఎంఆర్‌డీఏ చెర్లోపలి లే అవుట్‌కు తిరిగి ఆమోదం
- వివరాలు వెల్లడించిన జనసేన నాయకుడు దూలం గోపీ



సమావేశంలో మాట్లాడుతున్న జనసేన పార్టీ నాయకుడు గోపీ

కొత్తూరు, జూలై 24 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలో దశాబ్దమున్నర కాలానికి పైగా అపరిష్కృతంగా ఉన్న చెర్లోపలి రైతుల సమస్యకు ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ చొరవతో ఎట్టకేలకు మోక్షం లభించనుందని జనసేన పార్టీ పార్లమెంటరీ నియోజకవర్గ అధికార ప్రతినిధి దూలం గోపీ తెలిపారు. గురువారం అనకాపల్లిలోని జనసేన కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఈ ప్రాంత రైతాంగం గత 18 సంవత్సరాల నుంచి తమ భూములను అమ్ముకోలేక, రిజిస్ట్రేషన్లు చేసుకోలేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. 2007లో వుడాకు, రైతులకు మధ్య ఒప్పందం ప్రకారం ల్యాండ్ పూలింగ్‌లో 58 ఎకరాలకు గాను 48 ఎకరాల భూమిని ఇచ్చారన్నారు. అనంతరం వుడా అధికారులు రోడ్లు, కాలువల నిర్మాణాన్ని పాక్షికంగా చేపట్టారని, ఆ తరువాత ప్రభుత్వాలు, అధికారులు మారడంతో ఈ ప్రక్రియ ముందుకు సాగలేదని వివరించారు. ఈ అంశాన్ని ఎమ్మెల్యే కొణతాల ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్, మునిసిపల్ మంత్రి నారాయణల దృష్టికి గతంలో తీసుకు వెళ్లారన్నారు. దీంతో గురువారం జరిగిన రాష్ట్ర కేబినెట్ సమావేశంలో వీఎంఆర్‌డీఏ చెర్లోపలి లే అవుట్‌కు తిరిగి ఆమోదం తెలిపారన్నారు. దీంతో సమస్య పరిష్కారానికి మార్గం ఏర్పడినట్టు చెప్పారు. ఈ సమావేశంలో నూకాంబిక దేవస్థానం ఉత్సవ కమిటీ మాజీ చైర్మన్ పీలా నాగశ్రీను, టీడీపీ నాయకుడు బీఎస్ఎంకే జోగినాయుడు, ఎన్టీఆర్ ఆసుపత్రి డైరెక్టర్ ఆళ్ల రామచంద్రరావు, జనసేన నాయకుడు బుద్ద శ్రీను తదితరులు పాల్గొన్నారు.

నేడు పలు గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం

కశింకోట, జూలై 24 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని తాళ్లపాలెం సెక్షన్ పరిధి కన్నూరుపాలెం సబ్ స్టేషన్‌లో మరమ్మతు పనుల నేపథ్యంలో శుక్రవారం పలు గ్రామాలకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనుందని ఏపీఈపీడీసీఎల్ ఈఈ ఎస్.రామకృష్ణ తెలిపారు. ఈ కారణంగా ఉదయం ఎనిమిది గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు కన్నూరుపాలెం, తీడ, చెరకాం, లాలంకొత్తూరు, సుందరయ్యపేట, ఆనందపురం, జి.భీమవరం, సింగవరం, అచ్చెర్ల, కొత్త అచ్చెర్ల, మోసయ్యపేట, గోకువానిపాలెం గ్రామాలకు విద్యుత్ సరఫరా ఉండదని వివరించారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాల్సిందిగా కోరారు.

సబ్బవరం మండలంలో...

సబ్బవరం : ఇక్కడి సబ్ స్టేషన్ పరిధిలో శుక్రవారం నిర్వహణ పనులు చేపట్టనున్న కారణంగా పలు గ్రామాలకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడనుందని ఏపీఈపీడీసీఎల్ ఈఈ ఎస్ రామకృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కారణంగా ఫీడర్ పరిధిలో గల సబ్బవరం, ఇరువాడ, అసకపల్లి, పైడివాడ, గొల్లలపాలెం, తవ్వవానిపాలెం, అమృతపురం పంచాయతీల పరిధిలోని గ్రామాలకు ఉదయం తొమ్మిది గంటల నుంచి పన్నెండు గంట వరకూ విద్యుత్తుకు అంతరాయం ఏర్పడుతుందని, వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

ఏడాది పాలనలో ఎన్నో విజయాలు

- 'సుపరిపాలనలో తొలి అడుగు'లో మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద, మాజీ ఎమ్మెల్సీ బుద్ద నాగజగదీశ్వరరావు



జి.భీమవరంలో కరపత్రాలు అందిస్తున్న పీలా గోవింద

కశింకోట, జూలై 24 (ఆంధ్రజ్యోతి) : కూటమి ఏడాది పాలనలో ఎన్నెన్నో విజయాలు సాధించినట్టు రాష్ట్ర అర్బన్ ఫైనాన్స్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ పీలా గోవింద సత్యనారాయణ అన్నారు. గురువారం మండలంలోని జి.భీమవరం గ్రామంలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల గురించి వివరించారు. పథకాలు అందుతున్నదీ లేనిదీ మహిళలను అడిగి తెలుసుకున్నారు. ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ, ఎంపీ సీఎం రమేష్‌ల సహకారంతో అనకాపల్లి నియోజకవర్గంలో ఉన్న గ్రామాలను మోడల్ అభివృద్ధి చేస్తామని వెల్లడించారు. ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ పథకాలు అందిస్తున్న ఘనత కూటమి ప్రభుత్వానిదేనన్నారు. సన్నబియ్యంతో ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని పెడుతున్నట్టు చెప్పారు. అనంతరం సంక్షేమ పథకాలకు సంబంధించి కరపత్రాలను మహిళలకు అందజేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు కాయల మురళీ, ఉగ్గిన రమణమూర్తి, ద్వారపురెడ్డి సత్తిబాబు, సిదిరెడ్డి శ్రీను, విజయ్, నానిబాబు, కలగ సోమేశ్వరరావు, కన్నబాబు తదితరులు పాల్గొన్నారు.



81వ వార్డులో మహిళలకు పథకాలను వివరిస్తున్న బుద్ద

జీవీఎంసీ 81వ వార్డులో....

అనకాపల్లి టౌన్ : నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని మాజీ ఎమ్మెల్సీ టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి బుద్ద నాగజగదీశ్వరరావు అన్నారు. సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా గురువారం 81వ వార్డు విల్లూరి పరంధామయ్య వీధి, పీలా వెంకటరెడ్డినాయుడు వీధి, మహిళా కళాశాల ప్రాంతాల్లో ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాల గురించి వివరించారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఏడాది పాలనపై పెట్టుబడుదారులకు నమ్మకం కలిగిందన్నారు. అందువల్లే విశాఖపట్నంలోని ఐటీ రంగంలో భారీగా పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు వచ్చారన్నారు. వీటి వల్ల వేలాది మంది నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు కలగనున్నాయని వివరించారు. రాష్ట్రం ప్రస్తుతం అప్పుల ఊబిలో ఉన్నప్పటికీ అభివృద్ధి, సంక్షేమ పథకాలు ఎక్కడా ఆగడం లేదన్నారు. ప్రజలంతా ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌కు మరింత బాసటగా నిలవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు చదరం శివ, పొలిమేర నాయుడు, మళ్ల గణేష్, పెంటకోట శివరాం, కోరుకొండ అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి రాజరాజేశ్వరీ అమ్మవారి ఆలయ వార్షికోత్సవం



పరవాడ, జూలై 24 (ఆంధ్రజ్యోతి) : ఫార్మాసిటీలోని రాంకీ కమర్షియల్ హబ్ కూడలిలో గల గణపతి, సుబ్రహ్మణ్య, శ్రీచక్ర సహిత రాజరాజేశ్వరి అమ్మవారి ఆలయ వార్షికోత్సవం శుక్రవారం ప్రారంభం కానుంది. మూడు రోజులపాటు ఈ వేడుకలు నిర్వహంచను న్నట్టు ఫార్మాసిటీ యాజమాన్య ప్రతినిధులు తెలిపారు. ప్రతిరోజూ విశేష పూజలు, అర్చనలు, అభిషేకాలు జరపనున్నామన్నారు. పరిసర ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు విచ్చేసి ఈ వేడుకల్లో పాల్గొనాల్సిందిగా వారు కోరారు.

నేటి నుంచి దేవీపురంలో శ్రావణమాసం పూజలు



సబ్బవరం, జూలై 24 (ఆంధ్రజ్యోతి) : మండలం లోని దేవీ పురం సహస్రాక్షి రాజ రాజేశ్వరీదేవి పీఠంలో శుక్రవారం నుంచి శ్రావణ మాసం పూజలు ప్రారంభం కానున్నాయని గురుపత్నిఅన్నపూర్ణమ్మ తెలిపారు. మొదటి శుక్రవారం స్వర్ణ మహాలక్ష్మీ త్రిశతి నామావళి హోమం, రెండో శుక్రవారం ఆగస్టు ఒకటిన మహాలక్ష్మీ మూలమంత్ర హోమం, మూడువ శుక్రవారం ఆగస్టు 8న విద్యారణ్య శ్రీసూక్త హోమం, నాలుగవ శుక్రవారం ఆగస్టు 15న కమలాత్మిక హోమం, 5వ శుక్రవారం ఆగస్టు 22న మహాలక్ష్మీ సహస్రనామావళి హోమం జరపనున్నామన్నారు. ఈ వేడుకల్లో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొనాల్సిందిగా ఆమె కోరారు.

అశోక్‌గజపతిరాజును కలిసిన ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ



అశోక్‌గజపతిరాజుకు జ్ఞాపిక అందిస్తున్న కొణతాల

కొత్తూరు, జూలై 24 (ఆంధ్రజ్యోతి) : గోవా గవర్నర్‌గా నియమితులైన పూసపాటి అశోక్‌గజపతి రాజును ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. విజయనగరంలోని ఆయన స్వగృహానికి వెళ్లి సత్కరించి, జ్ఞాపికను అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు.

బొగ్గు లోడుతో వెళుతున్న లారీ బోల్తా : తప్పిన పెను ప్రమాదం



బోల్తాపడిన బొగ్గు లోడులారీ

పరవాడ, జూలై 24(ఆంధ్రజ్యోతి) : గంగవరం పోర్టు నుంచి హిందూజా పవర్ ప్లాంట్‌కు బొగ్గు లోడుతో బయలుదేరిన లారీ గురువారం సాయంత్రం 77వ వార్డు పరిధి పిట్టవానిపాలెం రైల్వే గేటు సమీపంలో అదుపు తప్పి బోల్తా పడింది. ప్రమాదం జరిగిన సమయంలో లారీలో డ్రైవర్ ఒక్కడే ఉన్నాడు. అదృష్టవశాత్తూ అతడు స్వల్ప గాయాలతో బయటపడ్డాడు. ఈ సంఘటనపై పరవాడ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అదృశ్యమైన బాలుడు తల్లిదండ్రులకు అప్పగింత

కశింకోట, జూలై 24 (ఆంధ్రజ్యోతి) : అదృశ్యమైన విద్యార్థి ఆచూకీని ఒకరోజులోనే గుర్తించి తల్లిదండ్రులకు అప్పగించారు కశింకోట పోలీసులు. ఇందుకు సంబంధించిన వివరాలివి. మండలంలోని వెదురుపర్తి గ్రామానికి చెందిన ఉల్లింగల గౌతమ్ బుధవారం అదృశ్యమయ్యాడు. దీంతో తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేయగా ఎస్ఐ కె.లక్ష్మణరావు కేసు నమోదు చేశారు. పదో తరగతి చదువుతున్న ఈ విద్యార్థి ఉదయం పాఠశాలకు యథావిధిగా వెళ్లాడు. పాఠశాలలో బ్రేక్ సమయం పదకొండు గంటల ప్రాంతంలో బయటకు వెళ్లాడని ఉపాధ్యాయులు తెలిపారు. దీంతో ఆ దిశగా పోలీసులు వివరాల సేకరణ ఆరంభించారు. సీసీ పుటేజీ ఆధారంగా గౌతమ్ సింహాచలంలో ఉన్నట్టు గుర్తించారు. అక్కడి నుంచి తీసుకు వచ్చి గురువారం తల్లిదండ్రులకు అప్పగించడంతో వారి ఆనందానికి అవధులు లేవు. ఈ సందర్భంగా వారు సీఐ అల్లు స్వామినాయుడు, ఎస్ఐ లక్ష్మణరావును, కానిస్టేబుల్ అప్పలరాజులకు కృతజ్ఞతలు తెలిపారు.

స్మార్ట్ మీటర్లకు వ్యతిరేకంగా ప్రచారం

కశింకోట, జూలై 24 (ఆంధ్రజ్యోతి) : విద్యుత్ స్మార్ట్ మీటర్లకు వ్యతిరేకంగా గురువారం ఇక్కడ సీఐటీయూ నాయకుడు దాకారపు శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్మార్ట్ మీటర్ల ద్వారా అదానీ గ్రూపునకు దోచిపెట్టేందుకు ప్రభుత్వం ఎత్తులు వేస్తున్నాయని ఆరోపించారు. స్మార్ట్ మీటర్లను బిగించే చర్యలను తక్షణమే మానుకోవాలని కోరారు.

ప్రమాదకర ప్రయాణం

» గెడ్డ వాగు నుంచి పాఠశాలకు చిన్నారులు



వాగు నీటిలోనుంచి బడికి వెళుతున్న బూసుపల్లి చిన్నారులు

జి.మాడుగుల, జూలై 24 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని వంజరి పంచాయతీ బూసుపల్లిలో పాఠశాల లేక చిన్నారులు తీవ్ర ఇబ్బందులకు లోనవుతున్నారు. రోజూ రెండు కిలో మీటర్ల దూరంలో ఉన్న కృష్ణాపురంలో ఉన్న పాఠశాలకు వెళ్లి చదువుకుంటున్నారు. మధ్యలో ప్రమాదకరమైన వాగు దాటి వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. ఈ గ్రామానికి రహదారి సదుపాయం లే దు. వర్షాకాలం కావడంతో కొండవాగు ఉధృతంగా ప్రవహిస్తోంది. దీంతో ఏర్పాటుచేసిన కర్రల వంతెన దాటి గ్రామస్థులు బాహ్యాప్రపంచానికి వెళ్లాల్సిన దుస్థితి నెలకొంటున్నట్టు ఎంపీటీసీ మాజీ సభ్యురాలు కె.ఊర్మిళ, ఆవేదనవ్యక్తం చేశారు. సుమారుగా 70 కుటుంబాలు జీవనం సాగిస్తున్న తమ గ్రామానికిరహదారి, పాఠశాల మంజూరు చేయాలని స్థానికులు కె.రాజుబాబు,మోహనరావు,రవికుమార్ ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేశారు.



కర్ర వంతెనపైనుంచి వెళ్తున్న గ్రామస్థులు

పశువుల్లో వ్యాధులపై అప్రమత్తం

» పశు సంవర్ధక శాఖ ఏడీ వేణుమాధవ్



కొత్తాబులో రైతులతో మాట్లాడుతున్న వేణుమాధవ్

పాడేరు రూరల్, జూలై 24 (ఆంధ్రజ్యోతి): సీజనల్‌గా పశువులకు వచ్చే వ్యాధుల నిరోధానికి ముందస్తుగా టీకాలు వేయించుకోవాలని పశు సంవర్ధక శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ పి.వేణుమాధవ్ రైతులకు సూ చించారు. మండలంలోని డోకులూరు వెటర్నరీ డిస్పెన్సరీ పరిధిలోని బర్సింగి పంచాయతీ కొత్తాబు గ్రామంలో చేపట్టిన ఎల్ఎస్‌డీ వ్యాక్సినేషన్‌ను గురువారం ఆయన అకస్మికంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన పశువుల పెంపకం రైతులతో మాట్లాడి వైద్యం అందుతున్న తీరును అడిగితెలుసుకున్నారు. లాంపీ స్కిన్ వ్యాధి వివరించి దాని నివారణకు తీసుకోవాల్సిన ముం దస్తు చర్యలు, పశువులలో నట్టల నివారణ మందుల ప్రాముఖ్యతను వివరించారు. పిడుదులు నివారణకు 2శాతం సైపర్ మిత్రిన్ ద్రావణాన్ని పశువులపై పిచికారీ చేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో లైవ్ స్టాక్ అసిస్టెంట్ కె.సురేశ్, ఏహెచ్‌ఏ బాలన్న పాల్గొన్నారు.

దుకాణాల ఎదుట డస్ట్‌బిన్లు తప్పనిసరి: డీఎల్‌పీవో



హుకుంపేట దుకాణాల వద్ద చెత్తను పరిశీలిస్తున్న డీఎల్‌పీవో

హుకుంపేట జూలై 24 (ఆంధ్రజ్యోతి):దుకా ణాల ఎదుట డస్ట్ బిన్లు తప్పసరి ఏర్పాటు చేయాలని డీఎల్‌పీవో చంద్ర శేఖర్ వ్యాపారులను ఆదేశించారు. గురువారం మండల కేంద్రం పర్యటించారు. ప లు దుకాణాల వద్ద చెత్తను చూసి ఆగ్రహం వ్యక్తంచేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వ్యాపారులు తమ దుకాణాలు ముందు డస్ట్ బిన్లు ఏర్పాటు చేస్తే పారిశుధ్య సమస్య ఉండని తెలిపారు. బహిరంగ ప్రదేశాల్లో చెత్త వేస్తే రూ. 1000 జరిమానా వేయాల్సి ఉంటుందన్నారు.పంచాయతీ కార్యదర్శి సత్యనారాయణ, సిబ్బంది రాజేశ్ పాల్గొన్నారు.

డ్రైనేజీ పనులకు శంకుస్థాపన



చోడముఖిపుట్టులో శంకుస్థాపన చేస్తున్న నేతలు

ముంచంగిపుట్టు, జూలై 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఏనుగురాయి పంచాయతీ చోటముఖిపుట్టు, రాతులపుట్టు, నడుమూరు, జంగంసరియా గ్రామాల్లో గురువారం జడ్పీ నిధులు రూ.20లక్షలతో డ్రైనేజీ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ నరసింగరావు మాట్లాడుతూ డ్రైనేజీ సదుపాయం లేక గ్రామాల్లో గిరిజనులు ఇబ్బందులు పడుతున్నారని జడ్పీ ఛైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర దృష్టికి తీసుకువెళ్లగా ఆమె స్పందించి నిధులు విడుదల చేశారన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యురాలు ఎం.సుబ్బలక్ష్మి, వైసీపీ నేత మూర్తి తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ జిల్లా కార్యదర్శిగా మంగతల్లి



కొయ్యూరు, జూలై 24 (ఆం ధ్రజ్యోతి) భారతీయ జనతా పార్టీ అల్లూరి జిల్లా కార్యదర్శిగా మచ్చల మంగతల్లిని నియమిస్తూ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ఆదేశాలు జారీ చేశారు. మండలంలో కొండగోకిరి పంచాయతీ పాడి గ్రామానికి చెందిన మంగతల్లి దివంగత నేత లోకుల గాంధీకి శిష్యురాలు. ఇటీవల ఆమెను పాడేరు మార్కెట్ కమిటీ ఛైర్మన్‌గా నియమించారు. ఈ పదవితో పా టు అదనంగా పార్టీ జిల్లా కార్యదర్శి పదవి వరించింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పార్టీ తనపై ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయకుండా జిల్లాలో పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని తెలిపారు. తనను నియమించిన రాష్ట్ర అధ్యక్షుడు మాదవ్‌కు ధన్యవాదాలు తెలిపారు.

తగ్గిన గరిష్ఠ ఉష్ణోగ్రతలు

పాడేరు, జూలై 24(ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతంలోని అల్పపీడనం ప్రభావంతో ఏజెన్సీలో వర్షాలు కురుస్తుండడంతో ఉష్ణోగ్రతలు తగ్గుముఖం పడుతున్నాయి. గురువారం అరకులోయలో 29.0 డిగ్రీల సెల్సియస్ గరిష్ఠ ఉష్ణోగ్రత నమోదు కాగా, పాడేరులో 27.8, డుంబ్రిగుడలో 27.6, హుకుంపేట, పెదబయలులో 26.5, చింతపల్లిలో 26.0, జి.మాడుగులలో 25.3, ముంచంగిపుట్టులో 24.6 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.



నిరుపయోగంగా ఉన్న మండల విద్యాశాఖ కార్యాలయం



భవిత కేంద్రంలోని చిన్న గదిలో విధులు నిర్వహిస్తున్న ఎంఈవో, సిబ్బంది

శిథిలావస్థలో విద్యాశాఖ కార్యాలయం

» భవిత కేంద్రంలోని చిన్న గదిలో ఎంఈవోల విధులు

» ప్రత్యామ్నాయ చర్యలు శూన్యం.. చింతపల్లిలో పరిస్థితి

చింతపల్లి, జూలై 24 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో విద్యాశాఖ కార్యాలయం శిథిలావస్థకు చేరుకున్నది. ఈ భవనం ఎప్పుడు కూలిపోతుందో తెలియని స్థితికి చేరడంతో నాలుగేళ్లుగా దీనిని వినియోగించడంలేదు. దీంతో ప్రస్తుతం ఇద్దరు ఎంఈవోలు కనీసం కూర్చోవడానికి సైతం స్థలంలేకుండాపోయింది. స్థానిక భవిత కేంద్రంలోనున్న ఓ చిన్నగదిలో కంప్యూటర్ వర్కు నిర్వహణతోపాటు ఎంఈవో కార్యాలయంగా వినియోగిస్తూ ప్రస్తుతంకాలం నెట్టుకొస్తున్నారు. ఫలితంగా విద్యాశాఖ అధికారులు, ఉపాధ్యాయులు అవస్థలు పడుతున్నారు. మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో సుమారు 40ఏళ్ల క్రితం మండల విద్యాశాఖ కార్యాలయాన్ని నిర్మిం చారు. ప్రస్తుతం ఈ భవనం పూర్తిగా శిథిలావస్థకు చేరింది. విద్యాశాఖ అధికారి కోసం ప్రత్యామ్నాయ భవనాలు అందుబాటులోలేవు. గతంలో మండలానికి ఒక ఎంఈవో ఉండేవారు. తాజాగా ఇద్దరు ఎంఈవోలను ప్రభుత్వం నియమించింది. అయితే విద్యాశాఖ అధికారుల విధులు నిర్వాహణకు కనీస సదుపాయాలు కల్పించడంలో గత ప్రభుత్వ పాలకులు, అధికారులు విఫలమయ్యారు.నూతన భవనం నిర్మాణం ఊసేలేదు. అలాగే విద్యాశాఖ కార్యాలయాన్ని మరమ్మతులకు సైతం ఏ చర్యలు తీసుకోవడంలేదు.

ఖాళీగా ఉన్న భవనాలు ఇవీ...

మండలంలోనున్న ప్రత్యామ్నాయ ప్రభుత్వ భవనాలు విద్యాశాఖ కార్యాలయం కేటాయిస్తే కొంత వరకు సమస్య పరిష్కారవుతుంది.. గతంలో పంచాయతీ రాజ్ సబ్ డివిజన్ కార్యాలయంగా వినియోగించిన భవనం ప్రై వేటు వ్యక్తుల ఆక్రమణలో ఉన్నది. అలాగే, 108 సిబ్బంది ఓ భవనాన్ని అనధికారికంగా వినియోగించుకుంటున్నారు. ఈ రెండు భవనాల్లో ఏదో ఒకటి విద్యాశాఖకు కేటాయిస్తే కొంత వరకు వసతి సమస్య తీరుతుంది. అలాగే విద్యాశాఖకు నూతన కార్యాలయ నిర్మాణానికి ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని ఉపాధ్యాయులు విజ్ఞప్తి చేస్తున్నారు.

ఏకలవ్య పాఠశాలలో సమస్యలు పరిష్కరిస్తా

» జేసీ కలెక్టర్ డాక్టర్ ఎంజే అభిషేక్ గౌడ

పెదబయలు, జూలై 24 (ఆంధ్రజ్యోతి): సీతగుంట పంచాయతీ లకేపుట్టు గ్రామంలోని ఏకలవ్య ఆదర్శ గురుకుల పాఠశాలలో నెలకొన్న సమస్యలు త్వరితగతిన పరిష్కరిస్తామని జాయింట్ కలెక్టర్ డాక్టర్ ఎంజే అభిషేక్ గౌడ హామీ ఇచ్చారు. గురువారం ఆయన పాఠశాలను సందర్శించారు. పాఠశాలలో సమస్యలను జేసీ దృష్టికి ప్రిన్సిపాల్ అమిత్ ఆనంద్ వివరించారు. పాడేరు, హుకుంపేట ఏకలవ్య పాఠశాలల విద్యార్థులను కూడా తమ పాఠశాలలోనే చదవడంతో వసతి, నీటి సమస్య తీవ్రంగా ఉంటోందన్నారు. విద్యార్థులకు తగ్గట్టు వర్కర్‌లు లేకపోవడంతో పారిశుధ్యం సమస్య నెలకొంటోందన్నారు. స్పందించిన జేసీ ముంచింగిపుట్టు మండలం లబ్బురులో నిర్మాణ దశలో ఉన్న ఏకలవ్య పాఠశాల భవనాల నిర్మాణం పూర్తయితే, అక్కడికి ఆ పరిధిలోని విద్యార్థులనుఆగస్టు 15 తరువాత తరలిస్తామన్నారు. పాడేరు, హుకుంపేట విద్యార్థులను ఆయా చోట్లకు పంపించేందుకు చర్యలు తీసుకుంటామని వివరించారు. అనంతరం పాఠశాలలో విద్యార్థుల వసతి గదులు, వంటశాల, డైనింగ్ హాల్‌లను పరిశీలించారు. మెనూ అమలు తీరును విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో గురుకులం ఓఎస్డీ మూర్తి, ఎంపీడీవో పూర్ణయ్య, తహశీల్దార్ త్రినాధరావు, ఎంఈవో-2 పుష్పజోసెఫ్, ఏటీడబ్ల్యూవో స్వర్ణలత, ప్రజా ప్రతినిధులు బొంజుబాబు, వరహాలమ్మ, రాజుబాబు, బొంజుబాబు తదితరులు పాల్గొన్నారు.



పాఠశాలలో భోజనాలను పరిశీలిస్తున్న జేసీ అభిషేక్ గౌడ

లబ్బూరులో ఏకలవ్య పాఠశాల భవనం పరిశీలన

ముంచంగిపుట్టు: మండలంలోని లబ్బూరులో ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ స్కూల్ భవన నిర్మాణ పనులు త్వరగతిన పూర్తి చేయాలని జాయింట్ కలెక్టర్ (జేసీ) డాక్టర్ ఎంజే అభిషేక్ గౌడ అధికారులకు ఆదేశించారు. ఈ నిర్మాణం పనులు గురువారం ఆయన పరిశీలించారు. పనులు పురోగతిపై సమీక్షించారు. ఇప్పటి వరకు చేపట్టిన పనులపై సంతృప్తి వ్యక్తం చేశారు. ఆగస్టు 15వ తేదీ నాటికి పనులు పూర్తి కావాలని సంబంధిత ఇంజనీరింగ్ అధికారులకు ఆదేశించారు. ఏకలవ్య స్కూల్‌లో విధులు నిర్వహించనున్న ఉపాధ్యాయులు వసతి సౌకర్యం ఏర్పాటు చేయాలని జేసీని కోరగా ఆయన సానుకూలంగా స్పందించారు. జేసీ వెంట ట్రైబల్ వెల్ఫేర్ ఈఈ కె.వేణుగోపాల్, తహశీల్దార్ శంకరరావు, ఇన్‌చార్జి ఎంపీడీవో సూర్యనారాయణమూర్తి, ఎంఈవో కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

ప్రదీప్ కుమార్‌కు ఉత్తమ శాస్త్రవేత్త అవార్డు



గవర్నర్ అబ్దుల్ నజీర్‌నుంచి పురస్కారమందుకుంటున్న ప్రదీప్ కుమార్

చింతపల్లి, జూలై 24 (ఆంధ్రజ్యోతి): రా ష్ట్ర స్థాయి ఉత్తమ శాస్త్రవేత్తగా జిల్లా ఏరు వాక కేంద్రం విస్తరణ విభాగం సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ పీబీ ప్రదీప్ కుమార్ గవర్నర్ అబ్దుల్ నజీర్ చే తులు మీదుగా అం దుకున్నారు. విజయవాడ స్వర్ణభారతి ట్రస్టు భవన్‌లో ఆచార్య ఎన్‌జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయంలో 57వ స్నాతకోత్సవం జరిగింది. ఈ కార్యక్రమంలో ప్రతిభ కనబరచిన శాస్త్రవేత్తలకు గవర్నర్ అవార్డులను అందజేశారు. 2023 ఏడాదికి సంబంధించి రాష్ట్రస్థాయి అవార్డు ప్రదీప్ కుమార్‌కి లభించింది. ఆయనకు రూ.ఐదు వేలు, జ్ఞాపిక, ప్రశంసా పత్రాన్ని అందజేశారు.

'గూడెంలో విద్యుత్, తాగునీటి సౌకర్యం కల్పించాలి'



సోలార్ దీపాలు పంపిణీలో జనసేన నేత సతీశ్‌కుమార్

అనంతగిరి, జూలై 24 (ఆంధ్రజ్యోతి):మండ లంలోని రొంపల్లి పంచాయతీ మారుమూల గూడెం గ్రామానికి విద్యుత్, తాగునీటి సౌకర్యాలు ఏర్పాటు చేయాలని ఎకనామిక్ రీసెర్చ్ ఫౌండేషన్ ఛైర్మెన్, జనసేన నేత వన్నెంరెడ్డి సతీశ్‌కుమార్ ప్రభుత్వాన్ని కోరారు. శుక్రవారం ఆ యన గూడెం గ్రామాన్ని సందర్శించి గిరిజనుల సమస్యలు తెలుసుకున్నారు. గ్రా మంలో 16 గిరిజన కుటుంబాటు జీవిస్తున్నాయన్నారు. ఆ గ్రామానికి కనీసం వి ద్యుత్ సౌకర్యం లేకపోవడం అంధకారంలో ఉంటున్నారు. తాగునీటి పథకం లేక ఊటనీరే దిక్కయిందన్నారు. అనంతరం సోలార్ విద్యుత్ దీపాలను పంపిణీ చేశారు.

కారు యజమాని గుర్తింపు

పెదబయలు, జూలై 24 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రానికి సమీపంలోని చిత్రాయిపుట్టు - సంపంగిపుట్టు ప్రధాన రహదారి మలుపు వద్ద మంగళవారం రాత్రి రోడ్డు పక్కన గోతిలో బోల్తా పడిన కారుకు సంబంధించి యజమానిని గుర్తించారు. గురువారం స్థానిక ఎస్ఐ కొల్లి రమణ ఆధ్వర్యంలో జేసీబీ సహాయంతో ఈ కారును బయటకు తీశారు. కారులోపల తనిఖీ చేశారు. కారు నెంబర్ (సీజీ 04 హెచ్‌ఏ 9286)ను ఆన్‌లైన్‌లో పరిశీలించగా ఛత్తీస్‌గఢ్‌లోని రాయపూర్ జిల్లా, పచ్‌పెడినక గ్రామానికి చెందిన సోమ్‌నాథ్ మఠం పేరుతో రిజిస్ట్రేషన్ కలిగినదిగా గుర్తించారు. కారులో ఎటువంటి సామగ్రి లభించలేదన్నారు. అలాగే, పోలీస్ స్టేషన్‌లో దీనిపై ఎవరూ ఫిర్యాదు చేయలేదని చెప్పారు. కారును స్థానిక పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఎవరైనా తగిన ఆధారాలతో వచ్చి కారును తీసుకువెళ్ల వచ్చని ఎస్ఐ తెలిపారు.

పేదరిక నిర్మూలనకే 'పీ4'

సీలేరు, జూలై 24 , (ఆంధ్రజ్యోతి): జీకేవీధి మండలం సీలేరు సచివాలయంలో గ్రామ కార్యదర్శి పరశురామ్ ఆధ్వర్యంలో పీ4 గ్రామ సభను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి స్థానిక సర్పంచ్ పి. దుర్గో, ఎంపీటీసీ సభ్యుడు పిల్లా సాంబమూర్తి పాల్గొన్నారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ రాష్ట్రంలో పేదరికం నిర్మూలనకు ప్రభుత్వం పీ4 కార్యక్రమాన్ని అమలు చేస్తోందన్నారు. ఈ కార్యక్రమాన్ని పేదలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ కె. వల్లీప్రసాద్, కూటమి నాయకులు బొర్రా కృష్ణ, డీసీసీ కార్యదర్శి కారే శ్రీనివాస్, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

వృద్ధులు, దివ్యాంగుల ఇళ్లకే రేషన్: జీసీసీ డీఎం



సమావేశంలో మాట్లాడుతున్న జీసీసీ డీఎం బుక్కా వెంకటేశ్

చింతపల్లి, జూలై 24 (ఆంధ్రజ్యోతి): గిరిజన గ్రామాల్లో 65 ఏళ్లకుపైబడిన వృద్ధులు, దివ్యాంగులకు ఈనెల 26 నుంచి రేషన్ బియ్యం డోర్ డెలివరీ చేస్తామని జీసీసీ డివిజనల్ మేనేజర్(డీఎం) బుక్కా వెంకటేశ్ అన్నారు. గురువారం జీసీసీ ఉద్యోగులతో ఆయన సమావేశమయ్యారు. ఈసందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాలపై దివ్యాంగులు, వృద్ధులకు ముందుగానే రేషన్ అందిస్తామన్నారు. కొయ్యూరు, జీకేవీధి, చింతపల్లి మండలాల పరిధిలో 4,717 మంది వృద్ధులు, దివ్యాంగులు ఉన్నారన్నారు. వృద్ధులు, దివ్యాంగులకు జీసీసీ సేల్స్‌మన్, డీలర్లు నెలాఖరు లోగా ఆగస్టు రేషన్ బియ్యం డోర్ డెలివరీ చేస్తారన్నారు. ఇప్పటికే 57,080క్వింటాళ్ల రేషన్ సంబంధిత డీఆర్ డిపోలకు తరలించామన్నారు. అలాగే ఆగస్టు నుంచి డీఆర్ డిపోల్లో నిత్యావసర సరకులను విక్రయిస్తామన్నారు. బ్రాంచి మేనేజర్ చల్లంగి నుగునాథం, పెట్రోల్ బంక్ ఇన్‌చార్జి రామకృష్ణ, ఎంఎల్ఎస్ ఇన్‌చార్జి రమణమూర్తి పాల్గొన్నారు.

జెన్‌కో ఈఈకి సన్మానం



బదిలీ అయిన జెన్‌కో ఈఈ శ్రీనివాసరెడ్డిని సన్మానిస్తున్న ఇంజనీర్లు

సీలేరు, జూలై 24 , (ఆంధ్రజ్యోతి) : పదోన్నతిపై బదిలీ అయిన జెన్‌కో ఈ ఈ శ్రీనివాసరెడ్డిని సీలేరు కాంప్లెక్సు పరిధిలోని ఇంజనీర్లు , సిబ్బంది గురువారం ఘనంగా సన్మానించారు. ఏపీ జెన్‌కో సివిల్ విభాగంలో శ్రీనివాసరెడ్డి ఈఈగా గత 10 నెలలు గా విధులు నిర్వహిస్తున్నారు. ఆయనకు ఈఈ నుంచి సూపరింటెండెంట్ ఇంజనీర్‌గా పదోన్నతిపై విజయవాడ విద్యుత్ సౌధాకు బదిలీఅయింది. ఈ సందర్భంగా గురువారం స్థానిక జెన్‌కో అతిథి గృహంలో శ్రీనివాసరెడ్డికి వీడ్కోలు సభను ఏర్పాటు చేశారు. ముఖ్య అతిథిగా సీలేరు కాంప్లెక్సు ఎస్ఈ చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ ఆయనసేవలను కొనియాడారు. అనంతరం ఈఈ దంపతులను సన్మానించారు. ఈ కార్యక్రమంలోఈఈలు రాజేంద్రప్రదసాద్, వరప్రసాద్, భాస్కరరావు, ఏడీఈ అప్పలనాయుడు,ఏఈ సురేశ్, అనుదీప్. సిబ్బంది పాల్గొన్నారు.

దామనాపల్లిలో పశు వైద్య శిబిరం

గూడెంకొత్తవీధి, జూలై 24 (ఆంధ్రజ్యోతి): వర్షాకాలం పశువులు, మేకలు, గొర్రెల్లో కలిగే వ్యాధులపై ఆదివాసీలు అప్రమత్తంగా ఉండాలని స్థానిక పశువైద్యాధికారి లోకుల రమేశ్ అన్నారు. గురువారం మండలంలోని దామనాపల్లిలో వైద్యశిబిరాన్ని ఏర్పాటు చేశారు. వివిధ వ్యాధులతో బాధపడుతున్న 20 మేకలు, 15 గొర్రెలు, ఎనిమిది ఆవులకు చికిత్స అందించారు. 85మేకలు, 50గొర్రెలకు వ్యాధి నిరోధక టీకాలు వేశారు. ఈసందర్భంగా పశువైద్యాధికారి మాట్లాడుతూ వర్షాకాలం పశువులు, మేకలు, గొర్రెలు వ్యాధులకు గురయ్యే అవకాశం ఉన్నదన్నారు.గ్రామంలో నిర్మాణంలోనున్న 13 పశువుల నీటి తొట్టిలు, రెండు మినీ గోకులాలను ఆయన పరిశీలించారు. కార్యక్రమంలో ఏహెచ్‌ఏలు జయరాజ్, బాలయ్య పాల్గొన్నారు.

ప్రకృతి సేద్యంతో ఆరోగ్యకర పంటలు

అరకులోయ జూలై 24 (ఆంధ్రజ్యోతి): గిరిజన రైతులు ప్రకృతివ్యవసాయంలో పంటలు సాగు చేసి లాభాలు పొందాలని అరకులోయ వ్యవసాయ సబ్‌డివిజన్ ఏడీఏ వి.మోహనరావు పిలుపునిచ్చారు. స్థానిక రైతు సేవా కేంద్రంలో ఏపీసీఎన్ఎఫ్ ద్వారా వ్యవసాయశాఖ గ్రామస్థాయి అధికారులతో మూడురోజులపాటు శిక్షణ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏపీసీఎన్ఎఫ్ ప్రతినిధి విజయ్‌కుమార్ లైవ్‌ప్రోగ్రాం ద్వారా ప్రకృతి వ్యవసాయం ఆవశ్యకతను వివరించారు. గిరి రైతులు రసాయన ఎ రువుల జోలికి పోకుండా ప్రకృతివ్యవసాయం ద్వారా పంటలు సాగు చేయాలన్నారు. డీపీఎం రామ్మోహనరావు మాట్లాడుతూ ఈ ప్రాంతంలో పంట సాగులో చేపట్టాలని యాజమాన్యపద్ధతులను తెలిపారు. ఘణ, ద్రవ జీవామృతం తయారీని వివరించారు. వ్యవసాయ అదికారులు, ఏపీసీఎన్ఎఫ్ డివిజన్ స్థాయి అధికారులు పి.సుధాకర్ (ఎన్ఎఫ్ఏ), ఎం.జానకి (మాస్టర్ ట్రైనర్), సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



అరకులోయ శిక్షణలో ఏడీఏ మోహనరావు

టీడీపీ బలోపేతానికి కృషి

» పరిశీలకుడు తోట దొరబాబు



గ్రామ కమిటీ సభ్యులకు ధ్రువపత్రాలందిస్తున్న దొరబాబు

హుకుంపేట జూలై 24 (ఆంధ్రజ్యోతి): టీడీపీ గ్రామ స్థాయి కమిటీ సభ్యులు పార్టీ బలోపేతానికి కృషి చేయాలని ఆ పార్టీ మండల పరిశీలకుడు తోట దొరబాబు సూచించారు. గురువారం మండలంలోని రంగశీలకొంతేలి, కోట్నాపల్లి పంచాయతీలకు పార్టీ మండల అధ్యక్షుడు బొంజుబాబు అధ్వర్యంలో సంస్థాగత ఎన్నికలు నిర్వహించారు. అనంతరం దొరబాబు ఎన్నికైన సభ్యులకు ధ్రువ పత్రాలు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూ టమి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమం, అభివృద్ధి పనులను గ్రామాల్లో ప్రజలకు అవగాహన చేయాలని సూచించారు. స్థానిక ఎన్నికలకు సర్పంచ్ నుంచి జడ్పీ వరకు టీడీపీ మద్దతుదారులు గెలుపునకు కృషి చేయాలని తెలిపారు. గ్రామకమిటీ సభ్యులుపార్టీకి కీలకమన్నారు. సంక్షేమ పథకాలను అర్హులకు అందేలా కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో నేతలు బొండా శ్యాం, నాగేశ్వరరావు, తులసీరావు, భాస్కరరావు, రాజారావు, సూర్యకాంతం తదితరులు పాల్గొన్నారు.

గిరిజన రైతులకు ప్రకృతి సాగుపై అవగాహన: ఏడీఏ



సమావేశంలో మాట్లాడుతున్న ఏడీఏ తిరుమలరావు

చింతపల్లి, జూలై 24 (ఆంధ్రజ్యోతి): గిరిజన రైతులలకు ప్రకృతి వ్యవసాయంపై సంపూర్ణ అవగాహన కల్పించాల్సిన బాధ్యత క్షేత్ర స్థాయి ఉద్యోగులపై ఉన్నదని స్థానిక వ్యవసాయ సహాయ సంచాలకులు (ఏడీఏ) బీవీ తిరుమలరావు అన్నారు. గురువారం ఉద్యాన పరిశోధన స్థానంలో కొయ్యూరు, జీకేవీధి, చింతపల్లి మండలాల వ్యవసాయ, ఉద్యాన సహాయకులు, ఎంపీఈవోలకు ప్రకృతి వ్యవసాయంపై ఏర్పాటు చేసిన మూడు రోజుల శిక్షణ కార్యక్రమాన్ని ఏడీఏ ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వం జిల్లాను ఆర్గానిక్ హబ్‌గా ప్రకటించిందన్నారు. గిరిజన ప్రాంతంలో శతశాతం పం టలు సేంద్రియ పద్ధతిలో సాగు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ అధికారి మధుసూదనరావు, ఏపీసీఎన్ఎఫ్ శిక్షణ ఇన్‌చార్జి బాబూజీ, కుమార్, డివిజన్ యూనిట్ ఇన్‌చార్జి వెంకట్ పాల్గొన్నారు.

కొంతలంలో వైద్య శిబిరం



మందులు అందిస్తున్న వైద్యాధికారి శ్రీనివాసరావు

జి.మాడుగుల, జూలై 24 (ఆంధ్రజ్యోతి): ఆంధ్ర వనవాసీ కళ్యాణ ఆశ్రమ్ ఆధ్వర్యంలో పాలమామిడి పంచాయతీ కొంతలంలో గురువారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించినట్టు ఆ సంస్థ వైద్యాధికారి శ్రీనివాసరావు తెలిపారు.116 మంది గిరిజనులకు వైద్య పరీక్షలు చేసి మందులు అందజేసినట్టు చెప్పారు. కొందరిని ఆపరేషన్లకు ఎంపిక చేసి విశాఖపట్నం తరలించనున్నట్టు చెప్పారు. వర్షాకాలం దృష్ట్యా కాచి వడబోసిన నీటిని తాగాలని సూచించారు. ఈ కార్యక్రమంలో నిక్కుల సాయి, పి.దుర్గశ్రీ, ఎం.శివ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడికి తీవ్ర గాయాలు

కొయ్యూరు, జూలై 24 (ఆంధ్రజ్యోతి): పెద మాకవరం సమీపంలో గురువారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో యువకుడు తీవ్రంగా గాయపడ్డాడు. వివరాలివి.. కృష్ణాదేవిపేట నుంచి నడింపాలెం పంచాయతీ దిబ్బలపాలెంకు చెందిన పాంగి వికాస్ ద్విచక్ర వాహనంపై వస్తుండగా పశువుల మందను తప్పించే ప్రయత్నంలో రోడ్డు రెయిలింగ్ ఇనుప గ్రిల్‌ను బలంగా ఢీకొనడంతో ఈ ప్రమాదం జరిగింది. దీనితో వికాస్‌కు ముఖం, ఎడమ కాలు, చేయితోపాటు గుండెకు తీవ్రగాయాలతో అపస్మారక స్థితికి చేరుకున్నారు. స్థానికులు క్షతగాత్రుని హుటాహుటిన ఆటోలో కృష్ణాదేవిపేట పీహెచ్‌సీకి తరలించారు. అక్కడ ప్రాథమిక వైద్య సేవలనంతరం అతనిని మెరుగైన వైద్య సేవలకు నర్సీపట్నం ఏరియా ఆసుపత్రికి తరలించారు.

విద్యార్థులకు అర్థమయ్యేలా బోధన అవసరం




విద్యార్థినులతో చదివిస్తున్న సర్వశిక్ష అభియాన్ అధికారి స్వామినాయుడు

హుకుంపేట జూలై 24 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయులు చిన్నారులకు అర్థమయ్యేలా బోధించాలని సర్వ శిక్ష అభియాన్ ప్రాజెక్టు కోర్డినేటర్ స్వామినాయుడు తెలిపారు. గురువారం స్థానిక కస్తూర్బా పాఠశాలను సందర్శించారు. ముందుగా హాసల్ గదులు, పిల్లల డైనింగ్ హాల్ పరిశీలించారు. తర్వాత తరగతి గదులకు వెళ్లి విద్యార్థులను ప్రశ్నలు వేసి సమాధానాలు రాబట్టారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పదో తరగతిలో శత శాతం ఉత్తీర్ణత సాధించేలా కృషి చేయాలని ఉపాధ్యాయులకు సూచించారు. నాడు- నేడు భవనం పూర్తికి ఆదేశించారు. ఈకార్యక్రమంలో ప్రిన్సిపాల్ అనిత, సిబ్బంది ఉన్నారు .

'చింతపల్లి కేంద్రంగా నియోజకవర్గం కావాలి'

గూడెంకొత్తవీధి, జూలై 24 (ఆంధ్రజ్యోతి): నియోజక వర్గాల పునర్విభజనలో సుదీర్ఘ చరిత్ర కలిగిన చింతపల్లికి ప్రాధాన్యం ఇవ్వాలని భారత్ ఆదివాసీ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు మొట్టడం రాజబాబు కోరారు. గురువారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ 2009లో చింతపల్లి నియోజక వర్గాన్ని పాడేరులో విలీనం చేశారన్నారు. దీంతో చింతపల్లి, జీకేవీధి, కొయ్యూరు మండలాలు అభివృద్ధిలో వెనుకపడినట్టు చెప్పారు. నియోజక వర్గాల పునర్విభజనకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని, చింతపల్లి కేంద్రంగా ప్రత్యేక నియోజక వర్గాన్ని ఏర్పాటు చేయాలన్నారు.

పరచుకున్న పచ్చదనం



కొత్తపాడేరు. పాతపాడేరు మధ్యలోని పంట పొలాల ప్రాంతం

విశాలమైన పచ్చని పైరు.. మధ్యలో పొలాలు.. మరోవైపు నీటి తుంపరులు.. అందులో ఒదిగి వ్యవసాయ పనుల్లో గిరిజనులు.. ఈ దృశ్యం పాడేరులోని పాతపాడేరు, కొత్తపాడేరు గ్రామాల మధ్యలో కనువిందు చేస్తోంది. ప్రస్తుతం ఏజెన్సీలో వర్షాలు కురుస్తుండడంతో ప్రకృతి సౌందర్యం ఆకట్టుకుంటోంది. పాతపాడేరు, కొత్తపాడేరు గ్రామాల మధ్యలో పంట పొలాలు గురువారం ప్రకృతి ప్రేమికులను ఆకట్టుకున్నాయి.

\- ఆంధ్రజ్యోతి/పాడేరు

బ్రిటీష్ సైనికాధికారుల సమాధుల స్థలంపై కన్ను

- స్థలం చుట్టూ పచ్చక్లాత్ కట్టిన ఆక్రమణదారులు
- పురావస్తు శాఖ ఆధీనంలో ఉన్నట్టు ప్రకటించినా లక్ష్యపెట్టని వైనం
- మండల న్యాయ సేవాధికార సంస్థలో కేసు ఉన్నప్పటికీ లెక్కలేని తనం
- పరదాను తొలగించిన రెవెన్యూ, మునిసిపల్ అధికారులు

నర్సీపట్నం, జూలై 24 (ఆంధ్రజ్యోతి) : బ్రిటీష్ సైనికాధికారుల స్థలం ఆక్రమణను మునిసిపల్, రెవెన్యూ అధికారులు అడ్డుకున్నారు. గురువారం సాయంత్రం స్థలం చుట్టు కట్టిన పచ్చ పరదాను హుటాహుటిన తొలగించారు. పట్టణ మెయిన్ రోడ్డును ఆనుకొని 46 సెంట్లు సమాధుల స్థలం ఉండేది. చుట్టూ దుకాణాలు కట్టుకోగా చివరకు 19 సెంట్లు మిగిలింది. ఈ స్థలాన్ని అల్లూరి స్మారక ప్రదేశంగా అభివృద్ధి చేయాలని చాలా ఏళ్లుగా డిమాండ్ ఉంది. బుధవారం గుర్తు తెలియని వ్యక్తులు స్థలం చుట్టూ పచ్చక్లాత్ కట్టారు. రెవెన్యూ అధికారులు కట్టించి ఉంటారని స్థానికులు భావించారు. ఒక పక్క న్యాయ సేవా ధికార సంస్థలో స్థలం పరిరక్షణ కోసం కేసు నడుస్తుంది. స్వయంగా న్యాయమూర్తి షియాజ్‌ఖాన్ బ్రిటీష్ సైనికాధికారుల స్థలాన్ని పరిశీలించి, పురావస్తు శాఖ, మునిసిపల్, రెవెన్యూ అధికారులకు రక్షణ చర్యలు చేపట్టాలని ఆదేశాలు జారీ చేశారు. సమాధుల స్థలానికి సంబంధించిన స్కెచ్, సరిహద్దు వివరాలు అందజేయాలని రెవెన్యూ అధికారులను పురావస్తు శాఖ ఏడీ షణ్ముఖరావు లిఖిత పూర్వంగా కోరారు. స్థలం తమ పరిధిలో ఉందని స్వయంగా పురావస్తుశాఖ ఏడీ ప్రకటించారు. అల్లూరి సాయుధ పోరాటానికి సాక్ష్యంగా ఉన్న బ్రిటీష్ సైనిక అధికారుల స్థలం పరిక్షణకు న్యాయమూర్తి ఆదేశాలతో అధికారులు చర్యలు తీసుకుంటుంటే. మరో వైపు పచ్చ పరదా కట్టి గుట్టుచప్పుడు కాకుండా దుకాణాల నిర్మాణానికి సాహసం చేయడం అందర్నీ విస్తుగొలిపింది. మునిసి పల్ కమిషనర్ సురేంద్ర, టౌన్ ప్లానింగ్ అధికారి ఫణి, సబ్ కలెక్టర్ కార్యాలయం సిబ్బంది దగ్గరుండి పరదాలు విప్పించారు.


బ్రిటీష్ సైనికాధికారుల సమాధుల స్థలం ఆక్రమణకు పచ్చ క్లాత్‌తో పరదా కట్టిన దృశ్యం

గంజాయి జోలికి వెళితే జీవితాలు నాశనం : డీఎస్పీ


విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతున్న డీఎస్పీ శ్రీనివాసరావు

నర్సీపట్నం, జూలై 24 (ఆంధ్రజ్యోతి) : గంజాయి సేవించినా, అక్రమ రవాణాకు పాల్పడినా యువత జీవితాలు నాశనంతో పాటు వారి కుటుంబాలు రోడ్డున పడతాయని నర్సీపట్నం డీఎస్పీ పోతిరెడ్డి శ్రీనివాసరావు అన్నారు. వేములపూడి జడ్పీహెచ్ స్కూల్‌లో విద్యార్థులకు గురువారం పోక్సో, బాల్య వివాహాలు, రోడ్డు ప్రమాదాలు, శక్తి యాప్ పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాల్య వివాహాల వలన చిన్నతనంలోనే ఆరోగ్య సమస్యలు తలెత్తుతాయన్నారు. విద్యార్థినులకు గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌పై అవగాహన కలిగి ఉండాలన్నారు. బాలికలను ఎవరైనా వేధించినా, అసభ్యకరంగా ప్రవర్తించినా పోక్సో చట్టం ప్రకారం కేసు నమోదు చేసి శిక్షించడం జరుగుతుందని స్పష్టం చేశారు. అలాగే ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని, ద్విచక్ర మోటారు వాహనాలు నడిపేవారు హెల్మెట్ ధరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రూరల్ సీఐ రేవతమ్మ, ఎస్ఐ రాజారావుతో పాటు పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

థియేటర్ల వద్ద జనసేన నాయకులు సంబరాలు


సంబరాల్లో మాట్లాడుతున్న రాజాన వీర సూర్యచంద్ర

నర్సీపట్నం అర్బన్, జూలై 24(ఆంధ్రజ్యోతి) : డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ నటించిన హరిహర వీరమల్లు చిత్రం గురువారం విడుదలైన సందర్భంగా నర్సీపట్నంలో పలు థియేటర్ల వద్ద జనసేన నాయకులు సంబరాలు జరుపుకున్నారు. ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి రాజాన వీర సూర్యచంద్ర ఆధ్వర్యంలో సినిమా ప్రారంభం సమయంలో ఉదయం కేక్ కట్ చేసి అందరికీ పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు పూడి చక్రవర్తి, జిల్లా కార్యదర్శి పంచాడ హరినాథ్, అల్లాడ సురేష్, సీనియర్ నాయకులు పాపారావు తదితరులు పాల్గొన్నారు.

కృష్ణాదేవిపేట పరిసర ప్రాంతాల్లో వర్షం



కృష్ణాదేవిపేట, జూలై 24 (ఆంధ్రజ్యోతి) : వాతావరణంలో మార్పుల కారణంగా గొలుగొండ మండలంలోని పలు ప్రాంతాల్లో గురువారం విడతల వారీగా వర్షం కురిసింది. రైతులు వ్యవసాయ పనులకు అనువుగా ఉంటుందని రైతులు ఆదనందం వ్యక్తం చేస్తున్నారు. ఏఎల్‌పురం, కొంగశింగి, సీహెచ్.నాగాపురం, పాతకృష్ణాదేవిపేట, లింగంపేట, చోద్యం తదితర గ్రామాల్లోని లోతట్టు ప్రాంతాల్లో ఎక్కడికక్కడ నీరు నిలిచిపోయింది. అయితే అంతటా చల్లబడడంతో జనం ఉపశమనం పొందారు.

చౌడేశ్వరిదేవికి భక్తిశ్రద్ధలతో పూజలు


అమ్మవారి ఆలయానికి జలాన్ని తీసుకు వెళుతున్న భక్తులు

నాతవరం, జూలై 24 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రం నాతవరంలో గల శక్తి పంచాయతన ఆలయ ప్రాంగణంలో దేవాంగుల కులదైవం చౌడేశ్వరి అమ్మవారి పండుగను గురువారం అత్యంత ఘనంగా నిర్వహించారు. ముందుగా స్థానిక వరసిద్ధి వినాయక ఆలయం నుంచి భక్తులు సారె, అభిషేకానికి నీళ్లను మేళతాళాల నడుమ ఊరేగింపుగా తీసుకు వెళ్లారు. అక్కడ పూజలు నిర్వహించిన అనంతరం అమ్మవారికి సారెను సమర్పించారు. పెద్ద సంఖ్యలో గ్రామస్థులు తరలి రావడంతో ఆలయం వద్ద కోలాహల వాతావరణం నెలకొంది. మధ్యాహ్నం అన్నసమారాధన జరిపారు. ఏటా ఆషాఢ మాసంలో చౌడేశ్వరి దేవికి ఈ వేడుకను జరపడం ఆనవాయితీ. ఈ కార్యక్రమంలో యర్రా కాశీ విశ్వేశ్వరరావు, వరహాలబాబు తదితరులు పాల్గొన్నారు.

గ్రామ సభల ద్వారా పేదల గుర్తింపు

- నర్సీపట్నం, గొలుగొండ ఎంపీడీవోలు ఉషశ్రీ, మేరీ రోజ్


నీలంపేట గ్రామ సభలో ఎంపీడీవో ఉషశ్రీ తదితరులు


ఏఎల్‌పురం గ్రామ సభలో మాట్లాడుతున్న ఎంపీడీవో మేరీ రోజ్

నర్సీపట్నం అర్బన్, జూలై 24 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పలు పంచాయతీల్లో గురువారం పీ-4 కార్యక్రమంపై గ్రామ సభలను నిర్వహించారు. నీలంపేటలో ఏర్పాటైన సభలో ఎంపీడీవో ఉషశ్రీ మాట్లాడుతూ కనీస అవసరాలకు నోచుకోని కుటుంబాల వివరాలను ఈ గ్రామ సభల ద్వారా గుర్తించి ప్రభుత్వానికి నివేదించడం జరుగుతుందన్నారు. గ్రామ సభల్లో గుర్తించిన వారందరికీ ప్రభుత్వం ద్వారా అందించే వివిధ పథకాల్లో అవకాశం కల్పించడం జరుగుతుందని వివరించారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల సర్పంచులు, సచివాలయాల సిబ్బంది పాల్గొన్నారు.

కృష్ణాదేవిపేట : గొలుగొండ మండలంలోని మేజర్ పంచాయతీ ఏఎల్‌పురంలో పీ-4పై గ్రామ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మేరీ రోజ్ మాట్లాడుతూ నిరుపేదలను ఈ కార్యక్రమం ద్వారా గుర్తించి వారి అభ్యున్నతికి ప్రభుత్వం కృషి చేయనుందన్నారు. గ్రామాల్లో పారిశుధ్య పనులపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ లోచల సుజాత, ఎంపీటీసీ రుత్తల రామకృష్ణ, పేరెంట్ కమిటీ చైర్మన్ రాజులునాయుడు, నర్సీపట్నం మార్కెట్ కమిటీ డైరెక్టర్ కమలాంబిక, టీడీపీ నాయకులు బొడ్డు జమీలు, చిటికెల చిట్టిబాబు, కార్యదర్శి కె. శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

పేకాట ఆడుతున్న ఐదుగురి అరెస్టు

- రూ.10 వేల నగదు, రెండు బైక్‌లను స్వాధీనం చేసుకున్న పోలీసులు

మాకవరపాలెం, జూలై 24 (ఆంధ్రజ్యోతి) : పేకాట ఆడుతున్న ఐదుగుర్ని పట్టుకున్నట్టు ఎస్ఐ దామోదర్ నాయుడు తెలిపారు. మండలంలోని మామిడిపాలెం, అడిగర్లపాలెం గ్రామాల మధ్య బుధవారం పలువురు పేకాట ఆడుతున్నట్టు ముందస్తు సమాచారం అందిందన్నారు. ఈ మేరకు సిబ్బందితో వెళ్లి దాడి చేసి ఐదుగుర్ని పట్టుకున్నట్టు చెప్పారు. వీరి నుంచి రూ.10 వేల నగదు, రెండు బైక్‌లు, ఐదు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకుని అరెస్టు చేశామన్నారు.

నేడు పలు గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం

గొలుగొండ, జూలై 24 (ఆంధ్రజ్యోతి) : ఇక్కడి సబ్ స్టేషన్‌లో శుక్రవారం మరమ్మతు పనులు చేపట్టనున్న నేపథ్యంలో పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడనుందని ఈఈ ఏవీఎస్‌ఎం అప్పారావు తెలిపారు. ఈ కారణంగా గొలుగొండ, జోగంపేట, పప్పుశెట్టిపాలెం, కొమిర మంగర్లపాలెం, పాతమల్లంపేటతో పాటు పలు గ్రామాలకు ఉదయం ఎనిమిది నుంచి మధ్యాహ్నం మూడు గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు. వినియోగదారులు సహకరించాల్సిందిగా ఆయన కోరారు.

నాతవరం మండలంలో...

నాతవరం : ఇక్కడ 33 కేవీ లైన్ కింద ఉన్న చెట్ల తొలగింపు కారణంగా శుక్రవారం పలుచోట్ల విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడనుదని ఏఈ చంద్రమౌళి తెలిపారు. చినగొలుగొండపేట, వెదురుపల్లి, సరుగుడు, గునుపూడి తదితర గ్రామాల్లో ఉదయం ఎనిమిది గంటల నుంచి మధ్నాహ్నం రెండు గంటల వరకు సరఫరా నిలిపివేయడం జరగుతుందన్నారు. వినియోగదారులు సహకరించాల్సిందిగా కోరారు.

నేడు పీఏసీఎస్ కార్యవర్గం ప్రమాణ స్వీకారం

మాకవరపాలెం, జూలై 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తామరం పీఏసీఎస్ చైర్‌పర్సన్‌గా నూతనంగా ఎన్నికైన శీరంరెడ్డి చినబాబు శుక్రవారం ప్రమాణ స్వీకారం చేయనున్నారని టీడీపీ మండల అధ్యక్షుడు ఆర్.వై. పాత్రుడు తెలిపారు. అలాగే, తాడపాలకు చెందిన శంకర్రావు, రాచపల్లి గ్రామానికి చెందిన బీజేపీ నాయకుడు అడిగర్ల రాంబాబు డైరెక్టర్లుగా ప్రమాణం చేయనున్నారని వివరించారు.

జోగంపేట శ్మశానవాటికలో బోరు ఏర్పాటు

గొలుగొండ, జూలై 24(ఆంధ్రజ్యోతి) : మండలంలోని జోగంపేట గ్రామంలో దళితులకు చెందిన శ్మశానంలో గురువారం బోరును ఏర్పాటు చేశారు. జడ్పీటీసీ సభ్యుడు సుర్ల వెంకట గిరిబాబు జడ్పీ సాధారణ రూ 1. లక్ష నిధులు మంజూరు చేశారు. దీంతో శ్మశానంలో బోరు వేయించినట్టు సర్పంచ్ జువ్వల లక్ష్మి తెలిపారు. దీంతో స్థానిక ప్రజలు ఆనందం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు పాల్గొన్నారు.

మొలకెత్తని విత్తనాలు


సరిగా మొలకెత్తని వరి ఆకు మడి

బుచ్చెయ్యపేట, జూలై 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కేపీ అగ్రహారం రైతు సేవా కేంద్రంలో కొనుగోలు చేసిన ఆర్‌జేఎల్ వరి విత్తనాలు సరిగా మొలకెత్తలేదని స్థానిక సర్పంచ్ గోపిశెట్టి శ్రీనివాసరావు తెలిపారు. గురువారం 'ఆంధ్రజ్యోతి'తో ఆయన మాట్లాడుతూ, నీటి తడి సమృద్ధిగా ఉన్నా విత్తనాలు నాటలేదన్నారు. ప్రభుత్వం రైతు సేవా కేంద్రాల ద్వారా విక్రయించిన విత్తనాలు నాటకపోతే ఎలా అని ప్రశ్నించారు. వరి నాట్లకు అదను దాటి పోతుండడంతో రైతులు ఆందోళన వ్యక్తంచేస్తున్నారన్నారు. వ్యవసాయ అధికారులు మొలక శాతం పరీక్షించకుండా విత్తనాలు విక్రయించడానికి అనుమతి ఇచ్చారని ఆయన ఆరోపించారు. తనష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని, నకిలి విత్తనాల బెడద లేకుండా చేయాలని కోరారు.

వంట మాస్టర్ల సంఘం నూతన కార్యవర్గం


సంఘం అధ్యక్షుడిగా ఎన్నికైన షేక్ హసీన్

చోడవరం, జూలై 24 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గ స్థాయి వంట మాస్టర్ల సంఘం నూతన అధ్యక్షునిగా షేక్ హసీన్ ఎన్నికయ్యారు. సిద్ధి వినాయక వంటమాస్టర్ల సంఘ సమావేశం గురువారం స్థానికంగా ఓ అతిథి గృహంలో నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షునిగా పారుపల్లి రాంబాబు, ఉపాధ్యక్షునిగా దేవర అప్పలరాజు, కార్యదర్శిగా గోటాల అప్పలరాజు, సం యుక్త కార్యదర్శిగా పైసూరు తాతంనాయుడులు ఎన్నికయ్యారు. కోశాధికారిగా బొబ్బిలి భూషణం, డైరెక్టర్లుగా షేక్ మదీనా, నాగుబిల్లి రాజు, అడిగర్ల వాసు, బొడ్డేటి రాంబాబు, పుట్ట రమణబాబును సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

ఉచిత నేత్ర వైద్య శిబిరం



కంటి పరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం

కె.కోటపాడు, జూలై 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మర్రివలసలో సంఘ మిత్ర రూరల్ డెవలప్‌మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో ఎల్వీ ప్రసాద్ ఐ ఇనిస్టిట్యూట్ వైద్యులు ఉచిత నేత్ర వైద్యశిబిరం శుక్రవారం నిర్వహించారు. 150 మందికి వైద్య పరీక్షలుచేయగా 15 మంది కేటరాక్ట్ ఆపరేషన్లకు, 20 మంది కళ్లద్దాలకు ఎంపిక చేశారు. ఈ కార్యక్రమంలో ఎల్వీ ప్రసాద్ ఐ ఇనిస్టిట్యూట్ కో- ఆర్డినేటర్ శివకుమార్, ఆప్టోమెట్రిస్ట్ సాయి, ఫీల్డ్ అసిస్టెంట్స్ సంతోషి, భూపతి, టెక్నీషియన్స్ యశ్వంత్, గీతాశ్రీ, సంఘ మిత్ర సొసైటీ కార్యదర్శి బొంతు మంగపతి, సంఘమిత్ర కార్యకర్తలు, పాల్గొన్నారు.

వీరమల్లు సినిమా వీక్షించిన జనసేన నాయకులు

బుచ్చెయ్యపేట, జూలై 24 (ఆంధ్రజ్యోతి): మండలంలో వడ్డాది ఎస్‌వీఎమ్ థియేటర్‌లో గురువారం ఏపీ డిప్యూటీ సీఎం, ప్రముఖ హీరో పవన్ కల్యాణ్ నటించిన హరిహర వీరమల్లు సినిమాను జన సైనికులతో కలసి చోడవరం నియోజక వర్గ ఇన్‌చార్జి పీవీఎస్ఎన్ రాజు వీక్షించారు. ఈ సందర్భంగా రాజు మాట్లాడుతు కార్యకర్తలు, అభిమానుల మధ్య సినిమా చూడడం ఆనందంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో వడ్డాది ఉప సర్పంచ్ దాడి సూర్యనాగేశ్వరరావు,మండల నాయకులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

పొంచి ఉన్న ప్రమాదం

- వడ్డాది- గాదిరాయి రోడ్డుకు ఇరువైపులా పిచ్చిమొక్కలు
- తొలగింపులో నిర్లక్ష్యం
- వాహనదారులు గగ్గోలు


గొటివాడ అగ్రహారం-వీరవిల్లి అగ్రహారం గ్రామాల మధ్య తుప్పలు

మాడుగుల రూరల్, జూలై 24 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని వడ్డాది- గాదిరాయి ఆర్‌అండ్‌బీ రోడ్డుకు ఇరువైపులా తుప్పలు, పిచ్చి మొక్కలు పెరిగిపోవడంతో ప్రమాదం పొంచి ఉంది. ఈ మార్గంలో వీరవిల్లి అగ్రహారం, పోతనపూడి అగ్రహారం, గొటివాడ అగ్రహారం, చింతలూరు, వీరనారాయణంతోపాటు గాదిరాయి, వమ్మలి, జేడీపేట, కింతలి తదితర గ్రామాల ప్రజలు అటు వడ్డాది జంక్షన్‌కు.. వీరనారాయణం గ్రామం పక్క నుంచి ఘాట్‌రోడ్డు జంక్షన్‌కి నిత్యంరాకపోకలకు సాగిస్తుంటారు. గాదిరాయి, వమ్మలి, జేడీపేట, కింతలి, తదితర గ్రామాల వారు చోడవరం, అనకాపల్లి విశాఖపట్నం పలు ప్రాంతాలకు వెళ్లాలంటే ఈ మార్గం మీదుగా ప్రయాణించి వడ్డాది జంక్షన్‌కి చేరుకుని అక్కడ నుంచి వెళుతుంటారు. ఇక, వీరవిల్లిఅగ్రహారం, గొటివాడ అగ్రహారం, పోతనపూడి అగ్రహారం గ్రామాల వారు ఘాట్‌రోడ్డు జంక్షన్‌కి, మాడుగులకు వెళ్లాలన్నా ఇదే రోడ్డులో గొటివాడ. వీరనారాయణం గ్రామాల మీదుగా రాకపోకలు సాగిస్తుంటారు. నిత్యం ద్విచక్ర వాహనాలు, ఆటోలు, మినీ వ్యాన్లు. ట్రాక్టర్లు , లారీలు తదితర వందలాది వాహనాలు తిరుగుతూ ఉంటాయి. ఈ మార్గంలో మలుపులు ఎక్కువగా ఉన్నాయి. దీనికితోడు రోడ్డుకిరువైపులా తుప్పలు, పిచ్చి మొక్కలు పెరిగిపోయాయి. ఇటీవల వర్షాలు కురవడంతో మరింత ఏపుగా పెరిగి రోడ్డుని కప్పేస్తున్నాయి. మలుపుల్లో ఎదురెదురు వాహనాలను గుర్తించడం వాహనచోదకులకు కష్టంగా మారింది. దీంతో భయాందోళన చెందుతున్నారు. పగటి వేళల్లో కంటే రాత్రి సమయాల్లో పరిస్థితి మరింత దారుణంగా ఉందని ఆయా గ్రామస్థులు వాపోతున్నారు. అయినా, ఆర్‌అండ్‌బీ అధికారులు జంగిల్ క్లియరెన్స్ పనులు చేపట్టడం లేదని మండిపడుతున్నారు. ఇకనైనా పాలకులు, అధికారులు చొరవ తీసుకుని ప్రయాణికుల కష్టాలు తీర్చాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

ఘనంగా 'అయ్యంకి' జయంతి


చోడవరంలో అయ్యంకి వెంకటరమణయ్య చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న దృశ్యం

చోడవరం, జూలై 24 (ఆంధ్రజ్యోతి): స్థానిక గ్రంథాలయంలో గురువారం గ్రంథాలయ పితామహుడు పద్మశ్రీ అయ్యంకి వెంకటరమణయ్య జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అయ్యంకి చిత్రపటానికి నివాళులు అర్పించారు. ఆయన సేవలను పలువురు వక్తలు కొనియాడారు. ఈ కార్యక్రమంలో లైబ్రేరియన్ ఎం. సాయిలక్ష్మి జోగేశ్వరి, పాఠకులు పాల్గొన్నారు.

గ్రంథాలయ ఉద్యమానికి అయ్యంకి సేవలు మరవలేం

రోలుగుంట స్థానిక గ్రంథాలయంలో అయ్యంకి వెంకట రమణయ్య జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈఓ-2 శెట్టి మో హన్‌రావు పాల్గొని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వెంకట రమణయ్య గ్రంథాలయ ఉద్యమంలో విశేష కృషి చేశారన్నారు. గ్రంథాలయ సంఘాన్ని ఏర్పాటు చేసి చరిత్రలో నిలిచిపోయారని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయాధికారి రాజుబాబు, స్కూల్ కాంప్లెక్స్ హెచ్ఎం శేషగిరిరావు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు మధ్యలో గుంత పూడ్చివేత


దిబ్బిడి వద్ద గుంత పూడివేతలో పోలీసులు

బుచ్చెయ్యపేట, జూలై 24 (ఆంధ్రజ్యోతి): మండలంలో కశింకోట బంగారు మెట్ట రోడ్డులో దిబ్బిడి వద్ద భారీ గుంతను స్థానిక ఎస్ఐ శ్రీనివాసరావు, అదనపు ఎస్ఐ భాస్కరరావు, పోలీసు సిబ్బందితో కలిసి కాంక్రీట్‌తో పూడ్చారు. ఈ గోతిలో నీరు చేరి వాహనదారులు రాక పోకలకు ఇబ్బంది ఎదుర్కొంటున్నారు. ఈ నేపథ్యంలో పోలీసులు గోతిని పూడ్చడంపై పలువురు వారిని అభినందిస్తున్నారు.

పక్కాగా విద్యా కార్యక్రమాలు అమలు: ఎంఈవో


మాట్లాడుతున్న ఎంఈఓ-2 మోహనరావు

రోలుగుంట, జూలై 24 (ఆంధ్రజ్యోతి) : పాఠశాలల్లో ప్రభుత్వం నిర్దేశించిన విద్యా కార్యక్రమాలను పక్కాగా అమలు చేయాలని ఎంఈఓ-2 శెట్టి మోహనరావు కోరారు. గురువారం ఎమ్మార్సీ భవనంలో కాంప్లెక్స్ ఉపాధ్యాయులు, సీఆర్పీలతో సమావేశం నిర్వహించారు. సీఆర్పీలు ప్రతీ రోజూ ఫీల్డ్ విజిట్ చేసి పర్యవేక్షించాలని ఆదేశించారు. ప్రతీ నెలా 10 నుంచి 15వ తేదీలోగా బియ్యం, చిక్కీలు, గుడ్ల ఇండెంట్‌ను తీసుకుని నివేదిక ఇవ్వాలన్నారు. విద్యార్థులందరికీ విద్యార్థి మిత్ర కిట్స్ శతశాతం పంపిణీ జరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. పాత తరగతి భవనాలుంటే ఆయా వివరాలను వెంటనే సేకరించి ఇవ్వాలన్నారు. 6వ తరగతి నుంచి 9వ తరగతి విద్యార్థులకు అమలు చేస్తున్న విద్యా శక్తి కార్యక్రమం వివరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాలల హెచ్ఎంలు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కె.కోటపాడు, జూలై 24 (ఆంధ్రజ్యోతి):కింతాడ ఫీడర్ పరిధిలో నిర్వహణ పనుల్లో భాగంగా శుక్రవారం ఉదయం తొమ్మిది నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు ఏఈ చంద్రశేఖర్ తెలిపారు. కింతాడ, జోగన్నపాలెం, గొల్లలపాలెం, ఆర్లే, కె. సంతపాలెం, చంద్రయ్యపేట, గొంపవానిపాలెం తదితర గ్రామాల ప్రజలు సహకరించాలని కోరారు.

చీడికాడ మండలంలో..

చీడికాడ: చీడికాడ ఫీడర్ పరిధిలో శుక్రవారం ఉదయం 9నుంచి మ.ధ్యాహ్నం 2గంటల వరకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేయనున్నట్టు ఏఈఈ నమ్మి వెంకటరావు తెలిపారు. చీడికాడ, జైతవరం, బైలపూడి, బి.సింగవరం పంచాయతీల్లోని వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

దోమల నివారణ చర్యలు

చీడికాడ, జూలై 24 (ఆంధ్రజ్యోతి): దోమల నివారణ మందు పిచికారీ తప్పనిసరని చీడికాడ పీహెచ్‌సీ వైద్యాధికారి సునీల్‌కుమార్ అన్నారు. మండలంలో కోనాం బాలుర పాఠశాలలో గురువారం హెల్త్ అసిస్టెంట్ వెంకటరమణ దోమల మందు స్ప్రే చేయించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి మాట్లాడుతూ, పాఠశాల విద్యార్థికి మలేరియా సోకడంతో స్ప్రేయింగ్ చేయించినట్టు చెప్పారు.. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం రమణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

సీతాఫలాలకు ధరలేక దిగాలు


కోనాం సంతలో విక్రయానికి వచ్చిన సీతాఫలాలు

చీడికాడ, జూలై 24 (ఆంధ్రజ్యోతి): మండల పరిధి కోనాంలో గురువారం జరిగిన సంతకు ఏజెన్సీ గ్రామాల నుంచి ఈ సీజన్‌లో తొలిసారిగా సీతాఫలాలను గిరిజనులు తీసుకువచ్చారు. అయితే ఉదయం నుంచి మబ్బులు వేయడంతోపాటు మైదాన ప్రాంత వ్యాపారులు రాక సీతాఫలాలకు గిట్టుబాటు ధర లభించలేదు. 150 సీతాఫలాలకు రూ.300లు నుంచి రూ. 350లు ధర పలికింది. బహిరంగ మార్కెట్‌లో ఒక పండు రూ. 10 నుంచి 15 విక్రయిస్తుండగా కోనాం సంతలో రూ. 3 మాత్రమే ధర పలికింది. దీంతో మధ్యాహ్నం వరకూ వేచిచూసి వ్యాపారులు అడిగిన ధరకే అమ్మకాలు సాగించి స్వగ్రామాలకు గిరిజనులు వెళ్లిపోయారు.

పరిసరాల పరిశుభ్రతకు సహకరించాలి

చీడికాడ, జూలై 24 (ఆంధ్రజ్యోతి): పరిసరాల పరిశుభ్రతకు గ్రామస్థులు సహకరించాలని శిరిజాం సచివాలయ కార్యదర్శి ఎ. కృష్ణవేణి కోరారు. పంచాయతీలోరోడ్ల పక్కన డ్రైనేజీల్లో పూడికను గురువారం తీయించారు. పలువురు కార్మికులు పాల్గొన్నారు.

స్మార్ట్ మీటర్లపై అపోహలొద్దు


ఏపీ ఈపీడీసీఎల్ ఎస్ఈ జి.ప్రసాద్

- అదనంగా ఎటువంటి చార్జీలు ఉండవు
- వినియోగం, బిల్లు నియంత్రణ వినియోగదారుల చేతుల్లోనే..
- ఏపీ ఈపీడీసీఎల్ సూపరింటెండెంట్ ఇంజనీర్ జి.ప్రసాద్

అనకాపల్లి టౌన్, జూలై 24 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ స్మార్ట్ మీటర్ల బిగింపుపై ఎటువంటి అపోహలు అవసరం లేదని, వీటి వల్ల వినియోగదారులపై ఎలాంటి అదనపు చార్జీల భారం ఉండదని ఏపీ ఈపీడీసీఎల్ సూపరింటెండెంట్ ఇంజనీర్ జి.ప్రసాద్ స్పష్టం చేశారు. ఈ మేరకు స్మార్ట్ మీటర్ల బిగింపు ప్రక్రియకు సంబంధించిన పూర్తి వివరాలను వెల్లడిస్తూ గురువారం విలేకరులకు ఒక ప్రకటన విడుదల చేశారు. విద్యుత్ వినియోగదారుల సేవల్లో పారదర్శకతను మరింత పెంచేందుకు కేంద్ర ప్రభుత్వం ఆర్‌డీఎస్ఎస్ పథకంలో భాగంగా అన్ని రాష్ట్రాల్లో స్మార్ట్ మీటర్ల ఏర్పాటును ప్రారంభించిందని, అందుకు అనుగుణంగా ప్రస్తుత మీటర్ల స్థానంలో స్మార్ట్ మీటర్లు మార్చాలనే ప్రతిపాదనకు 2021 ఫిబ్రవరిలో ఏపీఈఆర్సీ ఆమోదం తెలిపిందన్నారు. ఏపీఈఆర్సీ రెగ్యులేషన్ 2021 ప్రకారం ప్రభుత్వ, వాణిజ్య కేటగిరీల వినియోగదారులకు వీటిని బిగిస్తున్నామని తెలిపారు. వీటితో పాటు ఎక్కువ విద్యుత్ వినియోగం కలిగిన (హై వేల్యూ) గృహ వినియోగదారులకు కూడా అమర్చుతున్నామన్నారు. స్మార్ట్ మీటర్లను అమర్చే ముందు వాటి ప్రత్యేకతలు, ప్రయోజనాలపై విద్యుత్ సిబ్బంది వినియోగదారులకు అవగాహన కల్పిస్తున్నారని పేర్కొన్నారు.

ఎలాంటి అదనపు చార్జీలు ఉండవు

స్మార్ట్ మీటర్ ఏర్పాటు సమయంలో వినియోగదారులు వాటి ఖరీదు కానీ, చార్జీలు కానీ, మామూళ్లు కానీ చెల్లించవలసిన అవసరం లేదని ఎస్ఈ తెలిపారు. అంతేకాకుండా విద్యుత్ బిల్లుతో పాటు నెల వారీగా ఎటువంటి వాయిదాలు వసూలు చేయబోమని స్పష్టం చేశారు. స్మార్ట్ మీటర్లు పాత మీటర్ల కంటే ఎక్కువ విద్యుత్ వినియోగాన్ని నమోదు చేయవని, వీటి కారణంగా బిల్లులు పెరిగే ప్రసక్తే లేదని ఉద్ఘాటించారు.

మరింత పారదర్శకత పెరుగుతుంది

పాత మీటర్లతో పోలిస్తే స్మార్ట్ మీటర్ల ద్వారా మరింత పారదర్శకత పెరుగుతుందని ఎస్ఈ పేర్కొన్నారు. వినియోగదారులకు ప్రస్తుత విద్యుత్ వినియోగాన్ని పర్యవేక్షించడానికి, వినియోగాన్ని సరి పోల్చుకోవడానికి స్మార్ట్ మీటర్లు సహకరిస్తాయన్నారు. స్మార్ట్ మీటర్ కన్స్యూమర్ యాప్ ద్వారా 24 గంటలూ కనెక్ట్ అయి ఉంటాయని, ఫలితంగా వినియోగదారులు తమ వినియోగాన్ని ఎప్పటికప్పుడు తెలుసుకోవచ్చని చెప్పారు. పైగా అధిక వినియోగాన్ని నియంత్రించుకుంటూ విద్యుత్ బిల్లులను తగ్గించుకొనేందుకు సహకరిస్తాయన్నారు. పవర్ ట్రిప్ అయిన సమయంలో త్వరితగతిన గుర్తించి తద్వారా విద్యుత్ సరఫరాను వేగంగా పునరుద్ధరించేందుకు వీలు కలుగుతుందన్నారు. విద్యుత్ వినియోగాన్ని మెరుగ్గా ప్లాన్ చేయడంలో వినియోగదారులకు సహాయపడడానికి సంబంధించిన వివిధ రకాల స్మార్ట్ వినియోగ అలర్ట్‌లను ఎప్పటికప్పుడు అందిస్తామన్నారు.

టారీఫ్ ప్రకారమే విద్యుత్ బిల్లులు

ఆంధ్రప్రదేశ్ విద్యుత్ నియంత్రణ మండలి



(ఏపీఈఆర్సీ) వారు నిర్ణయించిన టారీఫ్ ప్రకారమే విద్యుత్ బిల్లులు వసూలు చేస్తామని పేర్కొన్నారు. బిల్లు వివరాలను నేరుగా వినియోగదారుని మొబైల్‌కు చేరవేస్తామని తెలిపారు. ఈ - బిల్‌లో వినియోగదారులు వినియోగించిన యూనిట్లు, వాటికి చెల్లించవలసిన చార్జీలు మొదలైన వివరాలు సవివరంగా తెలియజేస్తామన్నారు. విద్యుత్ వినియోగం, ఖర్చుపై పూర్తి నియంత్రణ వినియోగదారుల చేతుల్లో ఉండడం వలన విద్యుత్ వినియోగాన్ని మెరుగ్గా ప్లాన్ చేయడంలో స్మార్ట్ మీటర్లు వినియోగదారులకు సహకరిస్తాయన్నారు.

టోల్ ఫ్రీ నెంబర్ 1912

స్మార్ట్ మీటర్ ఏర్పాటుకు సంబంధించిన సందేహాల నివృత్తి కోసం వినియోగదారులు టోల్ ఫ్రీ నంబర్ 1912ను సంప్రతించవచ్చని ఎస్ఈ జి.ప్రసాద్ తెలిపారు.

క్రైం... crime news

మహిళ మెడలో పుస్తెలతాడు అపహరణ

నబ్బవరం, జూలై 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బాటజంగాలపాలెంలో గుర్తు తెలియని యువకులు బైక్‌పై వచ్చి మహిళ మెడలోని పుస్తెలతాడును తెంచుకుని పరారయ్యారు. దీనికి సంబంధించి సీఐ జి.రామచంద్రరావు తెలిపిన వివరాలు ఇలా వున్నాయి. గ్రామానికి చెందిన బోశం నాగలక్ష్మి బుధవారం సాయంత్రం జాతీయ రహదారి సర్వీసు రోడ్డులో గంటెలు నూర్చుకుంటోంది. ఈ సమయంలో అనకాపల్లి వైపు నుంచి ఇద్దరు గుర్తు తెలియని యువకులు బైక్‌పై వచ్చి ఆమె మెడలోని రెండున్నర తులాల బంగారు పుస్తెలతాడును అపహరించుకుపోయారు. బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు.

మృతుని వివరాలు లభ్యం


మృతుడు పరమేశ్వర్ పాండురంగ పవార్ (ఫైల్ ఫొటో)

పాయకరావుపేట, జూలై 24(ఆంధ్రజ్యోతి): గుల్లిపాడు-నర్సీపట్నంరోడ్డు రైల్వే స్టేషన్ల మధ్య బుధవారం రైలు నుంచి ప్రమాదవశాత్తూ జారిపడి మృతిచెందిన వ్యక్తి మహారాష్ట్ర వాసిగా తుని రైల్వే పోలీసులు గుర్తించారు. ఎస్ఐ జి.శ్రీనివాసరావు ఈ మేరకు గురువారం వివరాలు తెలియజేశారు. రైలులో ప్రయాణిస్తూ సుమారు 50 సంవత్సరాల వయసుగల వ్యక్తి గుల్లిపాడు, నర్సీపట్నం రోడ్డు రైల్వే స్టేషన్ల మధ్య ప్రమాదవశాత్తూ జారిపడి మృతిచెందిన విషయం తెలిసిందే. దీనిపై రైల్వే పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టగా ఇతను మహారాష్ట్రలోని నాందేడ్ జిల్లా రీసంగావ్ గ్రామానికి చెందిన పరమేశ్వర్ పాండురంగ పవార్‌గా గుర్తించారు. లారీ క్లీనర్‌గా పనిచేస్తూ అచ్యుతాపురానికి సరకుల లోడ్‌తో వచ్చాడని, అన్‌లోడ్ అయిన తరువాత ఇంటికి రైల్లో తిరుగు ప్రయాణం అయ్యాడని ఎస్ఐ తెలిపారు. నర్సీపట్నంరోడ్డు దాటిన తరువాత ప్రమాదవశాత్తూ రైలు నుంచి జారిపడి మృతి చెందాడన్నారు. గురువారం తుని ఏరియా ఆస్పత్రి మార్చురీలో పోస్టుమార్టం నిర్వహించిన అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించామని ఆయన తెలిపారు.

పెండింగ్ సమస్యలకు మోక్షం

... 5వ పేజీ తరువాయి

కేంద్రీయ విద్యాలయం ఏర్పాటుకు మార్గం సుగమం అయ్యింది.

తాండవ అభివృద్ధి పనుల కాంట్రాక్టు ముందుస్తు ముగింపు

సుమారు పదేళ్లపాటు సా..గిన తాండవ రిజర్వాయర్ అభివృద్ధి, ఆధునికీకరణ పనుల కాంట్రాక్టును ముందస్తుగా ముగిస్తూ రాష్ట్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది. తాండవ రిజర్వాయర్ కాలువల ఆధునికీకరణ కోసం 2007లో అప్పటి ప్రభుత్వం టెండర్లు పిలవగా.. మెసర్స్ మ్యాక్స్ ఇన్‌ఫ్రా లిమిటెడ్ సంస్థ అందరికన్నా తక్కువకు.. రూ.55.88 కోట్లకు టెండర్ దాఖలు చేసి పనులు దక్కించుకుంది. వివిధ కారణాల వద్ద పనుల్లో తీవ్ర జాప్యం జరిగింది. మొత్తం మీద 2017నాటికి 93.82 శాతం పనులు పూర్తయ్యాయి. వీటిల్లో ముఖ్యమైనది ప్రధాన కాలువకు సిమెంట్ లైనింగ్ పని. ఇది పూర్తికావడంతో ఆయకట్టుకు నీటి సరఫరా సాఫీగా జరిగింది. మిగిలిన పనులు పూర్తిచేయకపోవడంతో కాంట్రాక్టును ప్రభుత్వం ముగించలేదు. కాగా కార్మికులు అందుబాటులో లేకపోవడం, నిర్మాణ సామగ్రి ధరలు పెరగడంతోపాటు కరోనా కారణంగా నిర్మాణ పనులు పూర్తిచేయలేకపోయామని, అందువల్ల ముందస్తు ముగింపు (ప్రీ-క్లోజ్) చేయాలని 2020లో కాంట్రాక్టు సంస్థ ప్రభుత్వానికి లేఖ రాసింది. కానీ అప్పటి ప్రభుత్వం ప్రీక్లోజర్‌కు ఆమోదం తెలపలేదు. ఈ కారణంగా నిర్మాణ సంస్థకు సాంకేతికంగా పలు ఇబ్బందులు ఎదురయ్యాయి. వీటిని పరిగణనలోకి తీసుకున్న కూటమి ప్రభుత్వం.. పలు నిబంధనలతో తాండవ పనుల కాంట్రాక్టును ప్రీ-క్లోజ్ చేస్తూ ఆమోదం తెలిపింది.

చెర్లోపల్లి ఆవ ఖండం భూములకు విముక్తి

ఇదిలావుండగా అనకాపల్లి మండలం చెర్లోపల్లి ఆవ ఖండంలో వీఎంఆర్‌డీఏ (గతంలో వుడా) వివిధ అవరాల నిమిత్తం 2007లో రైతుల నుంచి భూమిని సమీకరించింది. లేఅవుట్ వేసిన తరువాత అభివృద్ధి చేసిన ప్లాట్లలో కొన్నింటిని రైతులకు ఇస్తామని ఒప్పందం చేసుకుంది. అయితే వివిధ కారణాల వల్ల ఈ ప్రాజెక్టు మధ్యలోనే ఆగిపోయింది. భూములు ఇచ్చిన రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయం ఎంపీ, ఎమ్మెల్యేల దృష్టికి రావడంతో వారి వినతి మేరకు వీఎంఆర్‌డీఏ సమీకరించిన 58.18 ఎకరాల భూమిని అభివృద్ధి చేసేందుకు మంత్రిమండలి ఆమోదం తెలిపింది.

ఐటీ హబ్‌గా విశాఖ

... 5వ పేజీ తరువాయి

అభివృద్ధి చేస్తుంది. దీని ద్వారా మరింత మందికి ఉపాధి లభిస్తుందని ప్రభుత్వ వర్గాలు చెబుతున్నాయి.

- **సాత్వా డెవలపర్స్:** ఈ సంస్థకు మధురవాడలోని హిల్ నంబరు 4లో 30 ఎకరాలు, ఎకరా రూ.1.5 కోట్లు చొప్పున కేటాయించారు. వీరు రూ.1,500 కోట్ల పెట్టుబడితోనే 25 వేల మందికి ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని ఒప్పందం చేశారు.
- **ఏఎన్ఎస్ఆర్ గ్లోబల్:** ఈ సంస్థకు రుషికొండ హిల్ నంబరు 3పై 2.5 ఎకరాలు, మధురవాడ హిల్ నంబరు 4లో 7.79 ఎకరాలు కేటాయించారు. వీరు రూ.వేయి కోట్ల పెట్టుబడితో పది వేల మందికి ఉద్యోగాలు ఇవ్వనున్నారు.

అగనంపూడి సమీపానున్న ఏపీ మెడ్‌టెక్ జోన్‌లో 5 స్టార్ హోటల్ ఏర్పాటుకు లాన్సమ్ లీజర్స్ సంస్థ ఒప్పందం చేసింది. అదేవిధంగా కోల్‌కతాకు చెందిన ఐటీసీ కంపెనీ కూడా విశాఖలో 5 స్టార్ హోటల్ ఏర్పాటుకు ముందుకురాగా దానికి కూడా తగిన భూములు ఇవ్వడానికి రాష్ట్ర మంత్రివర్గం నిర్ణయింది.

చినుకుపడితే చిత్తడే!

- బురద రోడ్డుతో గిరిజనుల అవస్థలు
- ప్రకటనలకే పరిమితమైన రహదారి అభివృద్ధి

మాడుగుల, జూలై 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కృష్ణపాలెం పంచాయతీ పరిధిలోని పులిగుమ్మి, చుట్టుగెడ్డ గ్రామాల రహదారి బురదమయంగా మారి రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్టు గిరిజనులు వాపోతున్నారు. పంచాయతీ కేంద్రం ఉంచి సుమారు రెండు కిలోమీటర్ల దూరం వున్న మట్టి రోడ్డు.. కొద్ది రోజుల నుంచి కురుస్తున్న వర్షాలతో అధ్వానంగా తయారైంది. వాహనాల విషయం అటుంచితే.. కనీసం నడిచి వెళ్లడానికి కూడా వీలు కాని పరిస్థితి నెలకొంది. తమ గ్రామాలకు చెందిన సుమారు 20 మంది విద్యార్థులు కృష్ణంపాలెం, కాశీపురం పాఠశాలల్లో చదువుతున్నారని, బస్సు సౌకర్యం లేకపోవడంతో పుస్తకాల బ్యాగులతో సర్కస్ ఫీట్లు చేస్తూ బురద రోడ్డులో రాకపోకలు సాగించాల్సి వస్తున్నదని గిరిజనులు వాపోయారు. గర్భిణులు, బాలింతలు, చిన్నారులు రెండు కిలోమీటర్ల దూరంలో ఉన్న యలంపాడు అంగన్‌వాడీ కేంద్రానికి వెళ్లిరావడానికి ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. రోడ్డు నిరాణానికి నిధులు మంజూరయ్యాయని చెప్పిన అధికారులు గతంలో ఇక్కడకు వచ్చి కొలతలు వేశారని, కానీ ఇంతవరకు రోడ్డు నిర్మాణ పనులు చేపట్టలేదని ఆయా గ్రామాలకు చెందిన జనపరెడ్డి వెంకటలక్ష్మి, భూలక్ష్మి, ఓంద్రు నీలమ్మ, చినప్పారావు, సోడబత్తిన రమేశ్, జనపరెడ్డి రాజులమ్మ, కిల్లు రాము, జనపరెడ్డి లక్ష్మణరావు, నూకరాజు, గోసమ్మ ఆవేదన వ్యక్తం చేశారు.


బురదమయంగా మారిన రోడ్డుపై నిల్చుని నిరసన తెలుపుతున్న గిరిజనులు

పల్లా భవనం కూల్చివేత వ్యవహారంలో ముగ్గురిపై వేటు

- నాటి గాజువాక జోన్ డీసీపీ నరేందర్‌రెడ్డి, టీపీఓ వినయ్‌ప్రసాద్, టీపీఎస్ వరప్రసాద్ సస్పెన్షన్
- అప్పటి సీసీపీ ఆర్జే విద్యుల్లత, సిటీప్లానర్ ప్రభాకర్, జడ్సీ శ్రీధర్‌కు షోకాజ్



విశాఖపట్నం, జూలై 24 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుతం గాజువాక ఎమ్మెల్యేగా ఉన్న పల్లా శ్రీనివాసరావుకు చెందిన భవనం కూల్చివేతలో నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించిన నాటి జీవీఎంసీ టౌన్‌ప్లానింగ్ అధికారులపై రాష్ట్ర ప్రభుత్వం కొరడా ఝుళిపించింది. రాజకీయ పలుకుబడికి తలొగ్గి దౌర్జన్యంగా యంత్రాలతో భవనాన్ని కూల్చివేయడంలో కీలకంగా వ్యవహరించిన అప్పటి గాజువాక జోన్ డీసీపీ నరేందర్‌రెడ్డి, టీపీఓ వినయ్‌ప్రసాద్, టీపీఎస్ వరప్రసాద్‌పై సస్పెన్షన్ వేటు వేస్తూ రాష్ట్ర మునిసిపల్ పరిపాలన శాఖ ప్రధాన కార్యదర్శి సురేష్‌కుమార్ ఉత్తర్వులు జారీచేశారు. అలాగే అప్పటి చీఫ్ సిటీ ప్లానర్ ఆర్జే విద్యుల్లత, సిటీ ప్లానర్ ఎ.ప్రభాకరరావు, జోనల్ కమిషనర్ శ్రీధర్‌లకు షోకాజ్ నోటీసులు జారీచేసింది.

జాతీయ రహదారిని ఆనుకుని గాజువాక సర్వే నంబర్లు 5/1, 5/3లో ఉన్న 864.33 చదరపు మీటర్ల స్థలంలో సెల్లార్+జీ+4 నిర్మాణానికి మాజీ ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు 2019 డిసెంబరు 21న ఆన్‌లైన్‌లో ప్లాన్ (ప్లాన్ నంబర్ బీఏ నంబర్1086/3055/బి/జెడ్5/జీఏడీ/2019) తీసుకున్నారు. దీని ప్రకారం భవన నిర్మాణ పనులు చేపడుతుండగా, అప్పటి వైసీపీ పెద్దలు రాజకీయ దురుద్దేశంతో భవనాన్ని కూల్చివేయాలని జీవీఎంసీ అధికారులను ఆదేశించారు.

దీంతో అప్పటి కమిషనర్ సృజన, చీఫ్ సిటీప్లానర్ ఆర్జే విద్యుల్లత ఆదేశాలతో టౌన్‌ప్లానింగ్ అధికారులు 2021 ఏప్రిల్ 25న అర్ధరాత్రి యంత్రాలతో కూల్చివేత ప్రారంభించారు. ఉదయం ఆరు గంటలయ్యేసరికి భవనం నేలమట్టం చేసి వెళ్లిపోయారు. తన భవనాన్ని నిబంధనలకు విరుద్ధంగా, రాజకీయ పలుకుబడికి తలొగ్గి కూల్చివేశారంటూ అప్పటి ప్రభుత్వానికి పల్లా శ్రీనివాసరావు ఫిర్యాదుచేశారు. దీనిపై వైసీపీ ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకోలేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత తన ఫిర్యాదుపై చర్యలు తీసుకోవాలని పల్లా కోరారు. దీంతో మునిసిపల్ మంత్రి పి.నారాయణ స్పందించి రాష్ట్రస్థాయి అధికారులతో విచారణ జరిపించగా, రాజకీయ కక్షతోనే భవనం కూల్చివేశారని తేలడంతో చర్యలు తీసుకున్నారు.

మెట్రో రైలు ప్రాజెక్టుకు గ్రీన్‌సిగ్నల్

- నేడు టెండర్లు
- ప్రాజెక్టు వ్యయం రూ.11,498 కోట్లు

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకున్న విశాఖపట్నం మెట్రో రైలు ప్రాజెక్టుకు శుక్రవారం టెండర్లు పిలవనున్నారు. ఈ ప్రాజెక్టుదశాబ్ద కాలంగా నలుగుతోంది. ఇప్పటివరకూ దీనికి సమగ్ర ప్రాజెక్టు నివేదిక ఖరారు కాలేదు. వంద శాతం నిధులు కేంద్రం ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వం కోరుతుండగా ఢిల్లీ నుంచి స్పందన కనిపించడం లేదు. దాంతో నిబంధనల ప్రకారం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రాజెక్టు వ్యయంలో 40 శాతం చెరో సగం భరించాలనే ప్రాతిపదికన తొలుత టెండర్లు పిలవాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఒకవైపు కేంద్రం నుంచి పూర్తిసాయం కోసం ప్రయత్నం చేస్తూనే దానికి ఆమోదం లభించేలోపు పనులు పట్టాలపైకి తేవాలని ఈ టెండర్లను పిలుస్తున్నట్టు సమాచారం. విశాఖ మెట్రో రైలు ప్రాజెక్టు మొదటి దశకు రూ.11,498 కోట్లు అవసరమని అంచనా వేశారు. స్టీల్ ప్లాంటు నుంచి కొమ్మాది వరకు మూడు కారిడార్లు నిర్మిస్తారు. వీటి పొడవు 46.43 కిలోమీటర్లు. ఈ ప్రాజెక్టుకు మొత్తం 99.8 ఎకరాలు అవసరం కాగా అందులో ప్రైవేటు భూములు పది ఎకరాల వరకూ ఉన్నాయి. వాటికి జీవీఎంసీ ద్వారా టీడీఆర్‌లు ఇవ్వాలని యోచిస్తున్నారు. టెండర్ల ప్రకారం ప్రాజెక్టు వ్యయంలో 60 శాతం పీపీపీ విధానంలో సమీకరిస్తారు. మిగిలిన 40 శాతంలో రాష్ట్ర వాటా 20 శాతం కాగా దానిని వీఎంఆర్‌డీఏ సమకూర్చాల్సి ఉంది. ఇందులో భూ సేకరణ, ఇతర ఖర్చులు ఉంటాయి. సుమారు రూ.882 కోట్లు నిధులు కావాలని అంచనా వేశారు.

ఫ్యూచర్ సిటీ కోసం ల్యాండ్ పూలింగ్

- విశాఖ, అనకాపల్లి, విజయనగరం జిల్లాల్లో 1,914 ఎకరాలు
- వీఆర్ఎండీఏ ప్రణాళికకు మంత్రిమండలి ఆమోదం

విశాఖపట్నం, జూలై 24 (ఆంధ్రజ్యోతి): విశాఖ మహా నగర ప్రాంత అభివృద్ధి సంస్థ (వీఎంఆర్‌డీఏ) మళ్లీ భూ సమీకరణ (ల్యాండ్ పూలింగ్) చేపట్టాలని నిర్ణయించింది. దీనికి రాష్ట్ర మంత్రి మండలి గురువారం పచ్చజెండా ఊపింది. విశాఖపట్నం శరవేగంగా అభివృద్ధి చెందుతున్న నేపథ్యంలో భవిష్యత్తులో అవసరమయ్యే భూముల కోసం ముందుగానే వీఎంఆర్‌డీఏ ప్రణాళిక రూపొందించుకుంది. ఇటు అనకాపల్లి, అటు విజయనగరం రెండు జిల్లాల వైపు నగరం విస్తరిస్తున్నందున జాతీయ రహదారికి సమీపంలో ఉన్న భూములను సమీకరించాలని భావిస్తోంది. విశాఖపట్నం, విజయనగరం, అనకాపల్లి జిల్లాల్లో మొత్తం 1,914 ఎకరాలు సమీకరించాలని నిర్ణయించినట్టు వీఎంఆర్‌డీఏ కమిషనర్ విశ్వనాథన్ గురువారం 'ఆంధ్రజ్యోతి'కి గురువారం తెలిపారు. ఈ ప్రక్రియ మొత్తం పారదర్శకంగా జరుగుతుందన్నారు. భూములకు సంబంధించిన రికార్డులన్నీ రెవెన్యూ శాఖ వద్దనే ఉన్నందున, వారినే భూ సమీకరణ చేయాలని కోరామన్నారు. అనకాపల్లిలోని చెర్లోపల్లి ఖండంలో 2007 నుంచి భూ సమీకరణ చేయాలని భావిస్తున్న 58.18 ఎకరాలకు కూడా ప్రభుత్వం అనుమతి ఇచ్చిందన్నారు.

గోవాడను ప్రభుత్వం ఆదుకోవాలి

... 5వ పేజీ తరువాయి

కలెక్టర్, కేన్ కమిషనర్ ద్వారా ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసినట్టు ఎండీ చెప్పారు. గత సీజన్‌లో ఉత్పత్తి అయిన పది వేల క్వింటాళ్ల పంచదార‌తోపాటు, మొలాసిస్ ఉందని, వీటిని విక్రయించడం ద్వారా వచ్చే సొమ్ముతో కొంత మేర రైతులు, కార్మికులకు బకాయిలు చెల్లించేందుకు ప్రయత్నిస్తున్నామన్నారు. షుగర్ ఫ్యాక్టరీలో డిస్టిలరీ ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం సానుకూలంగా ఉందని, అయితే అప్పటి వరకు ఫ్యాక్టరీ మూతపడకుండా నడిపించవలసిన అవసరం ఉందని ఎండీ అభిప్రాయపడ్డారు. డిస్టిలరీ ఏర్పాటైతే ఇక్కడ ఉత్పత్తి అయ్యే మొలాసిస్‌తోపాటు ఫ్యాక్టరీ పరిధిలో రైతులతో మొక్కజొన్న సాగు చేయించి, పంటను డిస్టిలరీకి సరఫరా చేసేలా చూస్తామన్నారు. ఈ ఏడాది చెరకు సాగు కొంతమేర తగ్గినందున రానున్న సీజన్‌లో ఫ్యాక్టరీకి 80 వేల టన్నుల వరకు చెరకు సరఫరా అయ్యే అవకాశం వుందని ఆయన చెప్పారు.

ఆలయ స్థలంలోకి వెళ్లొద్దు

... 5వ పేజీ తరువాయి

సిబ్బందిని ఆదేశించారు. ఈ సందర్భంగా తహశీల్దారు మహేశ్వరరావు మాట్లాడుతూ, సీతారామస్వామి ఆలయానికి చెందిన భూముల వివరాలను జిల్లా కలెక్టర్‌కు నివేదిక రూపంలో అందజేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ త్రినాథ్, దేవదాయ శాఖ అధికారి దివ్య, పంచాయతీ కార్యదర్శి వై.వి.సత్యనారాయణ, సచివాలయ సర్వేయర్ పాల్గొన్నారు.

ఉత్సాహంగా ఖరీఫ్

... 5వ పేజీ తరువాయి

మొదలుపెట్టారు.

గత ఏడాది ఎల్‌నినో కారణంగా వర్షాభావ పరిస్థితులు నెలకొని వరినాట్లు ఆలస్యం అయ్యాయి. ఈ ఏడాది అటువంటి పరిస్థితులు ఏర్పడలేదు. వ్యవసాయ శాఖ గణాంకాల ప్రకారం గత ఏడాది 53,121 హెక్టార్లలో వరినాట్లు వేశారు. ఈ ఏడాది మే నెల నుంచే వాతావరణం అనుకూలంగా వుండడంతో గత ఏడాది కన్నా ఎక్కువ విస్తీర్ణంలో వరి సాగు అవుతుందని అధికారులు అంచనా వేస్తున్నారు. ఇప్పటికే వేసిన మొక్కజొన్న, రాగి, సజ్జ, వేరుశనగ, నువ్వు, తదితర పంటలు ఆశాజనంగా వున్నాయని రైతులు చెబుతున్నారు.

అదానీ కంపెనీకి అన్నీ ధారాదత్తం

- ప్రజలు జీవితాలు, రాజ్యాంగ హక్కులు తాకట్టు
- సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు ధ్వజం



సమావేశంలో మాట్లాడుతున్న సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు. చిత్రంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు కె.లోకనాథం, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు డి.వెంకన్న అల్లూరి జిల్లా కార్యదర్శి అప్పలనర్స వున్నారు.

దేవరాపల్లి, జూలై 24 (ఆంధ్రజ్యోతి): ప్రజలు జీవితాలను, రాజ్యాంగ హక్కులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అదానీకి తాకట్టు పెడుతున్నాయని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు ఆరోపించారు. మండలంలో రైవాడ జలాశయం ఎగువ ప్రాంతంలో అదానీ కంపెనీకి ఇచ్చిన హైడ్రో పవర్ ప్రాజెక్టు అనుమతులను వ్యతిరేకిస్తూ చింతలపూడిలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, గిరిజనులకు మౌలిక సౌకర్యాలు కల్పించని ప్రభుత్వాలు.. అదానీ కంపెనీకి మాత్రం గిరిజన ప్రాంతంలో ప్రభుత్వ ఆస్తులను ధారాదత్తం చేస్తున్నాయని ధ్వజమెత్తారు. సీపీఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కె.లోకనాథం మాట్లాడుతూ, గిరిజన గ్రామాలకు రోడ్డు వేయాలన్నా, సాగు భూములకు పట్టాలు ఇవ్వాలన్నా.. రిజర్వు ఫారెస్టు పేరుతో అభ్యంతరం పెట్టే అధికారులు, రిజర్వు ఫారెస్టులో అదానీ కంపెనీ విద్యుత్ ఉత్పత్తి కేంద్రానికి భూములు ఎలా కేటాయించారని ప్రశ్నించారు. సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు డి.వెంకన్న అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో అల్లూరి సీతారామరాజు జిల్లా కార్యదర్శి పి.అప్పలనర్స, అనంతగిరి జడ్పీటీసీ సభ్యుడు దీసరి గంగరాజు, సర్పంచ్‌లు దొమ్మంగి బోడమ్మ, రామకృష్ణ, సీపీఎం మండల కార్యదర్శి బి.టి.దొర తదితరులు పాల్గొన్నారు.

ఎల్‌పీఎం వన్ టైం ఫీజు మినహాయింపు గడువు పెంపు

అనకాపల్లి కలెక్టరేట్, జూలై 24 (ఆంధ్రజ్యోతి): జాయింట్ ఎల్‌పీఎం (ల్యాండ్ పార్సిల్ మ్యాప్) సబ్ డివిజన్ కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు గతంలో అమలులో ఉన్న వన్‌టైం ఫీజు మినహాయింపు గడువు డిసెంబరు 31వ తేదీ వరకు పొడిగించినట్టు కలెక్టర్ విజయకృష్ణన్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు ప్రభుత్వ రెవెన్యూ శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ ఉత్తర్వులు జారీ చేసినట్టు ఆమె తెలిపారు. ఈ వన్‌టైం ఫీజు మినహాయింపు ప్రయోజనాన్ని అర్హులైన దరఖాస్తుదారులు వినియోగించుకోవాలని ఆమె కోరారు.

చైన్ స్నాచింగ్ ముఠా ఆటకట్టు

... 5వ పేజీ తరువాయి

భావించాడు. ఈ క్రమంలో ఎస్.రాయవరం మండలం వాకపాడు నుంచి నర్సీపట్నం వచ్చి సెలూన్ షాపు నిర్వహిస్తున్న తారుతురి రమేశ్‌తోపాటు నర్సీపట్నానికి చెందిన ఒక టీనేజర్ బాలుడితో ఈ ఏడాది జనవరిలో నానిరెడ్డికి పరిచయం ఏర్పడింది. సులువుగా డబ్బులు ఎలా సంపాదించాలన్న ఆలోచన చేశారు. ఇందుకోసం ఒంటరిగా వెళుతున్న మహిళల మెడల్లో నుంచి బంగారం గొలుసులు తెంచుకుని పారిపోవాలని నిర్ణయించారు. యూట్యూబ్‌లో పలు వీడియోలు తిలకించారు. అనంతరం మార్చి నెలలో మాకవరపాలెం మండలం కొండలగ్రహారంలో బైక్‌లతో రెక్కీ నిర్వహించి ఒక మహిళ మెడలో నుంచి బంగారం గొలుసు తెంచుకుని పారిపోయారు. తరువాత ఎస్.రాయవరం మండలం దార్లపూడి, గోకులపాడు, జె.వి.పాలెం, బుచ్చెయ్యపేట మండలం కృష్ణాపురం, తులసీనగర్, కశింకోట మండలం నూతనగుంటపాలెం, కశింకోట, ఎలమంచిలి మండలంలో మొత్తం తొమ్మిది చైన్ స్నాచింగ్‌లకు పాల్పడ్డారు. వీటికి సంబంధించి బాధితుల ఫిర్యాదుల మేరకు ఆయా పోలీసు స్టేషన్లలో కేసులు నమోదయ్యాయి. కొన్నిచోట్ల ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల ఫుటేజీల ఆధారంగా పోలీసులు చైన్‌స్నాచింగ్‌కు పాల్పడుతున్న నిందితులను గురించి, పలుచోట్ల నిఘా పెట్టారు. ఈ నేపథ్యంలో బుధవారం సాయంత్రం కశింకోట మండలం తాళ్లపాలెం నుంచి నర్సీపట్నం వెళ్లే రోడ్డులో పోలవరం కాలువ సమీపాన వీరిని అదుపులోకి తీసుకుని 26.01 తులాల బంగారు నగలు, మూడు ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. అనంతరం స్టేషన్‌కు తరలించి గురువారం అరెస్టు చేశారు. బాధితులకు బంగారు వస్తువులను అందించారు. నిందితులను కోర్టులో హాజరుపరిచి న్యాయమూర్తి ఆదేశాల మేరకు నానిరెడ్డి, రమేశ్‌లను రిమాండ్‌కు, బాలుడిని జువెనైల్ హోమ్‌కు తరలించారు. సీఐ స్వామినాయుడు ఆధ్వర్యంలో చైన్ స్నాచింగ్ కేసులను ఛేదించిన ఎస్ఐలు కె.లక్ష్మణరావు, పి.మనోజ్‌కుమార్, పోలీసు సిబ్బంది డి.గోపీ, బండారు శ్రీనివాసరావు, జి.శ్రీనివాసరావు, మహేశ్వరరావు, ఐటీ కోర్ కానిస్టేబుల్ దిలీప్‌కుమార్‌లను అభినందించారు.

హరిత పాఠశాలలు

... 5వ పేజీ తరువాయి

నాలుగు నుంచి 10వ తరగతి వరకు 93,437 మంది విద్యార్థులు వున్నారు. ఈ నెల 10న నిర్వహించిన మెగా పేరెంట్ టీచర్స్ మీట్‌లో ప్రతి విద్యార్థి తన తల్లి పేరిట ఒక మొక్కను నాటే కార్యక్రమాన్ని ప్రారంభించిన సంగతి తెలిసిందే. ఈ నెలాఖరులోగా లక్ష్యం మేరకు 1.18 లక్షల మొక్కలు నాటించాలని విద్యా శాఖాధికారులు భావిస్తున్నారు. ఇందులో భాగంగా ప్రతి విద్యార్థికి గ్రీన్ పాస్‌పోర్ట్‌ను అందిస్తున్నారు. జిల్లాలో ఇప్పటికే 50 వేల మంది విద్యార్థులకు వీటిని అందించారు. మిగిలిన కార్డులు జిల్లాకు రాగానే పంపిణీ చేయనున్నట్టు అధికారులు చెబుతున్నారు.

చికెన్ ధరలు

బ్యాగ్	రూ.లలో
రైతు ధర	87.00
లైవ్ ధర	107.00
విత్ స్కిన్	184.00
స్కిన్ లెస్	194.00

కోడి గుడ్లు (నెక్)

వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	485
విజయనగరం	489
శ్రీకాకుళం	489